మా స్వంత ప్రచురణలు

బొమ్మల శ్రీ షిర్డీసాయి జీవిత చరిత్ర
" అక్బర్ బీర్బల్ వినోద కథలు
" తెనాలి రామకృష్ణుని సంపూర్ణ హాస్య కథలు
" ఆలీబాబా 40 దొంగలు
" అల్లావుద్దీన్ అద్భుతదీపం
" గలివర్ సాహస యాత్రలు
" శ్రీ శ్రీ శ్రీ మర్యాదరామన్న కథలు
" భట్టి విక్రమార్కుని సాహస కథలు (2 భాగాలు)
" భేతాళ కథలు
" మొగల్ సామ్రాజ్య కథానాయకులు
" ప్రవక్త మహమ్మద్
" ఏసుక్రీస్తు కథలు
" మథర్ థెరిసా
" రవీంద్రనాధ్ ఠాకూర్
" యోగి వేమన
" భగత్ సింగ్
" అంబేద్కర్
" యశపాల్ కపూర్
" భగవతీచరణ్
" సుభాస్‌చంద్రబోస్
" చంద్రశేఖర ఆజాద్
" జయప్రకాష్ నారాయణ్
" సంఘసంస్కర్త రాజారామమోహనరాయ్
" పూజ్యబాపూజీ

భట్టి - విక్రమాదిత్యుల కథలు

మొదటి భాగము

పూర్వము నందిపురము అనునొక పట్టణము ఉండెను. ఆ పట్టణమున గల బ్రాహ్మణ అగ్రహారమునందు చంద్రవర్ణుడు అను బ్రాహ్మణుడు నివసించుచుండెను. అతడు సకలశాస్త్రములు శ్రద్ధగా చదివి గొప్ప పాండిత్యము సంపాదించెను. అయినను అతనికి తృప్తికలుగలేదు. తనకు తెలిసిన విద్యలుగాక ఇంకను ఎన్ని విద్యలుగలవో అన్ని విద్యలను అభ్యసించవలెనని తలంచుచుండెను. అట్టి తలంపుతో నతడు పిల్లనిత్తుమని వచ్చి అడిగినను వివాహమాడుటకు యిష్టపడక బ్రహ్మచర్యము నవలంబించి సర్వకాల సర్వావస్థలలో జ్ఞానార్జనకై ప్రయత్నించుచుండెను.

కొంతకాలము గడచిన తరువాత చంద్రవర్ణుడు నందిపురమును వదలి దేశదేశములు తిరుగుచు నూతనవిద్యలను నేర్పు గురువునకై వెదుకసాగెను. ఎన్ని దేశములు తిరిగినను అతనికి నచ్చిన గురువు దొరకలేదు.

నూతన గురువుకై అన్వేషించుచు అతడొకనాడు అరణ్యమార్గమున పోవుచు మిక్కిలి అలసిపోయెను. అతనికి విపరీతమయిన దాహ బాధ కలిగెను. దాహబాధ తీర్చుకొను తలంపుతో నీటి కొరకు వెదకుచుండగా నొక పెద్ద చెరువును, ఆ చెరువుగట్టుపై నొక గొప్ప రావిచెట్టును కనబడినవి. వానిని చూచి చంద్రవర్ణుడు చాల సంతోషించి, చెరువు వద్దకుపోయి అందున్న నిర్మలోదకము త్రాగి దాహబాధ తీర్చుకొనెను. పిమ్మట శ్రమ తీర్చుకొనుటకై రావిచెట్టు నీడలో పరుండెను.

చంద్రవర్ణునకు బ్రహ్మరాక్షసి కనబడుట

ఆ రావిచెట్టుపై కొంతకాలమునుండి ఒక బ్రహ్మరాక్షసి నివసించుచుండెను. ఆ రాక్షసి సకల విద్యలు నేర్చిన దిట్ట. ఆ రాక్షసి బ్రహ్మలోకమును కోరి తపస్సు చేయుచుండెను.

అతడు ప్రతి దినము తపము ముగిసిన పిమ్మట చెట్టునుండి క్రిందికి దిగి చెఱువు వద్దకుపోయి అనుష్టానములను తీర్చుకొనుచుండెను. మామూలు ప్రకారము ఆ రాక్షసి చెట్టునుండి క్రిందికి దిగి అచ్చట గాఢనిద్రలో మునిగియున్న చంద్రవర్ణుని చూచి జాలిపడెను. దగ్గరకు వెళ్ళి అతనిని మేల్కొలిపి "ఎవరునీవు? ఇచ్చటికేలవచ్చితివి? నీ నివాస స్థలమేది? ఏ మాత్రము దాచక చెప్పుము" అని అడిగెను.

చంద్రవర్ణుడు పైకి లేచి, కండ్లు నలుముకొని తన ఎదుటనున్న బ్రహ్మరాక్షసికి నమస్కరించి "అయ్యా! నేనుబ్రాహ్మణుడను. చంద్రవర్ణుడను పేరు గలవాడను. నా నివాసస్థలము నందిపురము. నాకు తెలియని విద్యలను తెలిసికొన గోరి సద్గురు కొరకు వెదకుచు యిచ్చటికి వచ్చినాను. ఈ చెరువు నీరు త్రాగి దాహ బాధ తీర్చుకొంటిని. మార్గాయాసము తీర్చుకొనదలచి ఈ చెట్టునీడ నాశ్రయించితిని. మీ ముఖ తేజస్సును చూచి సకల శాస్త్రములు తెలిసినవారని గ్రహించితిని. నాకు తెలియని విద్యలు తెలిపి నన్ను కృతార్థుని చేయ గోరుచున్నాను" అని వినయంగా కోరెను.

చంద్రవర్ణుని మాటలు విని బ్రహ్మరాక్షసుడు "చంద్రవర్ణా! నీ ఆశయము తెలిసికొని చాల సంతోషించితిని. నీవు కోరినట్లు నాకు తెలిసిన విద్యలన్నింటిని నీకు చెప్పెదను. నీ వేమాత్రము అశ్రద్ధ చూపక, నా సమయమును వృధా చేయక తెలిసికొనుము. స్వల్పకాలములోనే నీవు సకల విద్యలు నేర్చుకొన

గలవు" అని పలుకగా, చంద్రవర్ణుడు "గురుదేవా! మీరు చెప్పినట్లు చేయుదును. శ్రద్ధగా నేర్చుకొందును. విద్యార్జనలో ఎన్ని కష్టము లెదురైనను సంతోషముగా భరింతును" అని చెప్పెను.

అప్పుడు ఆ బ్రహ్మరాక్షసుడు "చంద్రవర్ణా! నేను ఈ చెట్టుమీద నుండి నీకు నేర్పదలచిన విషయములను రావియాకులపై వ్రాసి పడవేయు చుందును. నీవు ఆ పత్రములపై వ్రాసిన విషయములను ఆరు మాసములు రాత్రింబగళ్ళు నిద్రాహారములు మాని చదువుకొనుచుండవలెను. ఒక్క దినమైనను ఉల్లంఘించకుండ నేనువ్రాసిన విషయములను శ్రద్ధగా పఠించునప్పుడే నీకు సంపూర్ణ పాండిత్యము లభించగలదు. ఈ నియమం తప్పితివా నా ఆగ్రహమునకు గురి కాగలవు" అని చెప్పెను.

చంద్రవర్ణుడు బ్రహ్మరాక్షసుడు చెప్పినట్లు చేయుదునని ప్రమాణము చేసెను. అప్పుడా రాక్షసుడు చంద్రవర్ణునికొక మంత్రమునుపదేశించి "దీని నను ష్ఠించినచో నీకు ఆకలి, నిద్రలు కలుగవు" అని చెప్పెను. చంద్రవర్ణుడు భక్తి శ్రద్ధలతో ఆ బ్రహ్మరాక్షసుడు చెప్పినట్లు చేయుచు ఆరు మాసములలో సకల విద్యలు చక్కగా నేర్చెను. బ్రహ్మరాక్షసుడు చెప్పిన మంత్రమును పఠించుచు ఆరు మాసములు ఆకలి, నిద్రల బాధ పొందకుండెను.

ఇంతలో ఆ బ్రహ్మరాక్షసుని తపస్సు పూర్తియైనది. అతనికి కలిగిన శాపము తీరినది. అంతనాతడు దివ్యమయిన తేజస్సుతో ప్రకాశించసాగెను. చంద్రవర్ణుడతని దివ్యరూపమును చూచి ఆశ్చర్యపడసాగెను. అతనిని చూచి దివ్యరూపుడైన బ్రహ్మరాక్షసుడు "చంద్రవర్ణా! నేనొక శాపవశమున యిచ్చట బ్రహ్మరాక్షసుడనై పుట్టితిని. బ్రహ్మను గూర్చి తపస్సుచేసి శాపవిముక్తుడనైతిని. కొద్దిసేపటిలో నేను బ్రహ్మలోకమునకు పోవుదును" అని చెప్పుచుండగా, బ్రహ్మ

రథము వచ్చి అతని ముందు ఆగెను. అతడు ఆ రథము నెక్కె- "చంద్రవర్ణా నీవు సకల విద్యా శారదుడవైతివి. నీవు నేర్చుకొనవలసిన విద్యలిక ఏవియులేవు. కావున నీవు తక్షణము నీ దేశమునకువెళ్ళిపొమ్ము. రూపలావణ్యములు గల కన్యను వివాహమాడి, పుత్ర పౌత్రాభివృద్ధి కలిగి సుఖముగా బ్రతుకుము" అని ఆశీర్వదించి, అంతరిక్షమునకు పోయెను.

చంద్రవర్ణుని చేరదీసి రక్షించిన వేశ్య

పిమ్మట చంద్రవర్ణుడు కొండలు, కోనలు దాటి తన స్వస్థలము చేరదలచి వచ్చుచుండెను. బ్రహ్మరాక్షసుడు పెట్టిన ఆరు మాసముల గడువు పూర్తియగుటవలన అతడు ఆకలికి, నిద్రకు బాధపడుచుండెను. ఎంతో శ్రమపడి నడచి నడచి అతడు ప్రతిష్ఠాపురము అను నగరమును సమీపించెను. ఊరిలోనికి పోయి ఎవరినైన బ్రాహ్మణుని ఆశ్రయించి కడుపునిండా భుజించి, హాయిగా నిద్రించి ముందుకు సాగిపోవలెనని తలచెను. ఎంత ప్రయత్నించినను అతడు ముందుకు నడువలేక పోవుచుండెను. తుదకు ఒక అందమైన గృహమును చూచి అది బ్రాహ్మణులదే అయివుండునని భావించి అతికష్టముపై నడచి పోయి ఆ యింటి యరుగుపైకిచేరి, తన వెంట తెచ్చిన రావియాకుల మూటను తల క్రింద పెట్టుకొని పండుకొనెను.

ఆ సమయమున ఆ యింటిలో నెవరునులేరు. చంద్రవర్ణుడు భావించినట్లు ఆయిల్లు బ్రాహ్మణులదికాదు. అది భాగ్యవంతురాలైన ఒక వేశ్యది. ఆమె పేరు అలంకారవల్లి. ఆమె సంగీత, నృత్యశాస్త్రములు బాగుగా నేర్చిన దేవదాసి. ఆమె ఆనాటి రాత్రి పది గంటలవరకు దేవునిసేవలోగడిపి యింటికి వచ్చెను.

అట్లు యింటికి వచ్చిన అలంకారవల్లి తన యింటి అరుగుపై గుర్రు

పెట్టి నిద్రపోవుచున్న చంద్రవర్ణుని చూచినది. దగ్గరకు వెళ్ళి పిలిచినది. ఎంత పిలిచినను అతడు మేల్కొనలేదు. అంతట నామె యింటిలోనికిపోయి దీపము తీసుకొని వచ్చి పరుండియున్న వ్యక్తిని చూచినది. అతని బట్టలు చినిగి, ధూళితో నిండి బిచ్చగాని బట్టల వలెనున్నవి. తల వెంట్రుకలు ధూళితో నిండి యిటునటు చెదరి యున్నవి. గడ్డము బాగుగా పెరిగియున్నది. ఇట్లున్నను అతని ముఖములో మంచి కళ వున్నది. ఇతడు ఎవడో గొప్పవ్యక్తియే అయివుండును. ఈ



అలంకారవల్లి చంద్రవర్ణునకు చికిత్స చేయించుట

విధముగ ఉండుటకు కారణమేమో అని ఆలోచించసాగినది. ఆ రాత్రి అంతయు అతనిని కదుపకూడదని నిశ్చయించుకొని లోనికి పోయి నిద్రించినది.

ఆమె తెల్లవారు ఝామునలేచి, కాలకృత్యములు తీర్చుకొని, వీధి లోనికి వచ్చి అరుగుపై నిద్రించుచున్న వ్యక్తిని చూచినది. ఇంత మత్తునిద్రా అనుకొన్నది. మరికొంతసేపైన తరువాత అతని సమీపమునకు పోయి పిలచినది. ఎంత పిలిచినను అతడు ఉలుకలేదు, పలుకలేదు. లోనికి పోయి నీళ్ళుతెచ్చి ముఖముపై చిలుకరించినది. అప్పుడతడు కండ్లు తెరచి, ఏదో చెప్పబోయినాడు. కాని మాట రాలేదు, అతని స్థితి చూచి ఆమె అతడు మరణావస్థలో నున్నట్లు తలచినది. వెంటనే ఒక ఘన వైద్యుని పిలిపించి, అతనిని కాపాడమని చెప్పినది.

వైద్యుడు చాలాసేపు చంద్రవర్ణుని పరీక్షించి అతడు చాలా కాలము నుండి నిద్రాహారములేక యిట్టి ప్రమాదస్థితికి లోనైనాడని, బ్రతుకుట కష్టమని, బ్రతికించుటకు గట్టిగా ప్రయత్నింతునని చెప్పినాడు. వైద్యుని మాటలు విని అలంకారవల్లిచాలా భయపడినది. ఎన్ని ఖర్చులైనను నేను భరింతును. ఆయన నెట్లయినను బ్రతికింపుడు. మీకు కోరినంత ధనమిచ్చెదనని వైద్యునితో చెప్పినది.

ఆ వైద్యుడు ఎంతో కష్టపడి, మంచి మంచి మందులు తయారుచేసి చంద్రవర్ణునకు యిచ్చి, పాలు-పండ్లరసములు యిప్పించి చికిత్స చేయసాగినాడు. ఇట్లువారము దినములు జరిగిన తరువాత చంద్రవర్ణుడు నిద్రనుండి మేల్కొని నెమ్మదిగ పైకి లేచి కూర్చుండి నలువైపుల తేరిపారచూచి, అది దేవదాసి గృహమని గ్రహించి, యెవరికిని చెప్పకుండ వెళ్ళిపోసాగినాడు.

అప్పుడచ్చటికి అలంకారవల్లి వచ్చి అతడు పైకి లేచినందుకు ఆనందించి, వెళ్ళిపోవుచున్నందుకు బాధపడి, అతనిని ఆపి, "బ్రాహ్మణోత్తమా!

ప్రాణాపాయస్థితిలో నున్న మీకు మందులు యిప్పించుచు, తగు సేవలు చేస్తూ, అత్యుత్తమమైన ఆహారము, మొదలగునవి యిచ్చుచు మిమ్ము కాపాడిన నాకు చెప్పనైన చెప్పకుండ వెళ్ళిపోవుట న్యాయమా! నన్ను విడిచిపోవద్దు. నన్ను వివాహమాడి సంతోషపెట్టుడు. మిమ్ము విడిచి నేను జీవించలేను" అని అనేక విధముల బ్రతిమాలసాగెను.

చంద్రవర్ణుడు ఆమె ఎంత బ్రతిమాలినను వేశ్యకులమున పుట్టిన అలంకారవల్లిని వివాహమాడుటకు ఇష్టపడలేదు. "నా ప్రాణములు రక్షించిన నీవు నాకు తల్లివంటిదానవు. కావున నిన్ను వివాహమాడజాలను" అని చెప్పెను.

అలంకారవల్లి చంద్రవర్ణుని అందచందములకు ముగ్ధురాలై గాఢముగ మోహించెను. ఆ మోహమును అణచుకొనలేక అతని నెట్లయిన పెండ్లి ఆడవలెనని నిశ్చయించుకొని అతనిని వెళ్ళిపోనీయక అడ్డుపడి తగవుపెట్టెను. వీధిలో తగవుపడుచున్న వారిద్దరిని రాజభటులు తీసుకొనివెళ్ళి రాజు ముందు నిలిపిరి.

రాజు చంద్రవర్ణుని చూచి "అలంకారవల్లి అను నీ దేవదాసి యింటి ముందు నిలబడి ఆమెతో తగవుపడుటకు కారణమేమి?" అని అడుగగా, చంద్రవర్ణుడు "రాజా! నేను బ్రాహ్మణకులమున పుట్టినవాడను. సకలశాస్త్రములు చదివినవాడను. దేశాంతరమేగి నా స్వస్థలమునకు పోవుచు ఈ నగరము చేరు సరికి నిద్రాహారములు లేక అలసిపోయి ఈమె యింటి అరుగుపై నిద్రించితిని. ఆమె పిలచినను నేను లేవక పడియుండుటవలన ఆమె జాలిపడి వైద్యుని పిలిపించి చికిత్స చేయించి నా ప్రాణము రక్షించినమాట యదార్థము. నా ప్రాణమును కాపాడిన ఆమెను నేను తల్లిగా భావించుచున్నాను కాని ఆమెనన్ను వివాహమాడ గోరుచున్నది. నేనందుకు యిష్టపడక నా దారిని నేను పోవుచుండగా అడ్డుకొని అల్లరిచేయుచున్నది. సద్బ్రాహ్మణ కులమున పుట్టిన నేను ఎంత సద్గుణవంతు

రాలైనను వేశ్యకులమున పుట్టిన కన్యను వివాహమాడిన లోకము హర్షించునా ? అట్లు చేయుటవలన వర్ణాశ్రమ ధర్మములు చెడవా ?" అని అడిగెను.

తరువాత రాజు అలంకారవల్లిని చూచి "నీవు చెప్పుకొనదలచినదేమైన కలదా" అని అడుగగా, ఆమె "ప్రభూ! ఈ చంద్రవర్ణుడు చెప్పిన విషయము లన్నియు యదార్థమైనవే. నేను వేశ్యకులమున పుట్టిన దాననైనను నా గుణ గణములు ఈ నగరవాసులెల్లరు యెరుగుదురు. ఇతనిని చూచినక్షణమునుండి నా కీతనిపై అధికమైన మోహము కలిగినది, ఇతనిని వివాహమాడకున్న నేను జీవించలేను. ఇతడు నన్ను వివాహమాడునట్లుచేసి నా ప్రాణము కాపాడుడు" అని విన్నవించుకొనెను.

ఆమె మాటలు విని రాజు తన మంత్రులను, సభలోనున్నవారిని చూచి "వీరి తగవు తీర్చుటకు తగు మార్గము ఆలోచించి చెప్పుడు" అని కోరగా, మంత్రులు ఆలోచించి యిట్లు చెప్పిరి— "మహాప్రభూ ! బ్రాహ్మణకులమున పుట్టిన పురుషుడు తన కులమున పుట్టినస్త్రీని గాక ఇతర కులమున పుట్టిన ఒక స్త్రీని వివాహమాడకూడదు. అట్లు వివాహమాడవలసివచ్చినచో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కన్యలను ఒకే ముహూర్తమున వివాహమాడవచ్చును. ఇది హిందూ ధర్మశాస్త్రము ననుసరించి చెప్పిన అభిప్రాయము. అటుపైన తమ యిష్ట మెట్లున్నదో అట్లు చేయుడు" అని చెప్పిరి.

మహారాజు అంతకు ముందే చంద్రవర్ణుని అందచందములు చూచి ముగ్ధుడై తన కుమార్తెకు తగిన వరుడు కాగలడు. అతని నెట్లయినను ఒప్పించి తన కుమార్తె నిచ్చి వివాహము చేయవలెనని ఆలోచించుచుండగా మంత్రులు పై విధముగా తమ అభిప్రాయము చెప్పిరి.

అంతట రాజు మంత్రులను, సభికులను చూచి "చంద్రవర్ణుడు అంద

చందములలో చంద్రునివంటివాడు. సకలశాస్త్రములు చదివినవాడు. అతనికి నా కుమార్తె నిచ్చుటకు నిశ్చయించుకొంటిని. నాతోపాటు మా పురోహితుడు, వైశ్య కులోత్తముడగు సోమశేఖరుడు కూడ తన కుమార్తెలను చంద్రవర్ణునకు యిచ్చి పెండ్లి చేయుటకు సమ్మతించగలరని నమ్ముచున్నాను. ఇక శూద్ర కులమున జన్మించిన అలంకారవల్లి ముందే అతనిని వివాహమాడుటకు సిద్ధముగా వున్నది. ఈ విధముగ చేసిన చంద్రవర్ణునకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రకులములకు చెందిన కన్యలను ఒకే ముహూర్తమున చేసిన వారము కాగలము" అని పలుకగా, పురోహితుడును, సోమశేఖరుడును తమ పుత్రికలను చంద్రవర్ణునకు యిచ్చుటకు అంగీకరించిరి. రాజు మాట కాదనలేక చంద్రవర్ణుడు నాలుగుకులములకు చెందిన కన్యలను పెండ్లాడుటకు అంగీకరించెను. అలంకారవల్లి ఎంతో పొంగి పోయెను.

ఒక శుభముహూర్తమున మహారాజు చంద్రవర్ణునకు తన పుత్రికను, పురోహితుని పుత్రికను, సోమశేఖరుని కుమార్తెను, అలంకారవల్లిని యిచ్చి ఎంతో వైభవముగా వివాహము జరిపించెను. చంద్రవర్ణుడు తలచని తలంపుగా జరిగిన తన వివాహమును తలచుకొని, దైవానుగ్రహము వలన తన కట్టి అదృష్టముకలిగినదని గ్రహించి ఎంతో ఆనందముగా కాలము గడుపుచుండెను.

భట్టి-విక్రమాదిత్యుల పుట్టుక

ఇట్లు జరుగుచుండగా, చంద్రవర్ణునకు బ్రాహ్మణభార్యవలన పల్లవుడు, రాజు పుత్రికవలన విక్రమాదిత్యుడు, వైశ్యకాంతవలన భట్టి, వేశ్యకాంతవలన భర్తృహరి అను నలుగురు పుత్రులు కలిగిరి. వారు నలుగురు శుక్లపక్ష చంద్రుని వలె దినదినాభి వృద్ధి పొందుచు సకల విద్యలనభ్యసించిరి.

ఇట్లు జరుగుచున్న సమయమున ప్రతిష్ఠాపుర మహారాజు తీవ్రవ్యాధికి లోనైనాడు. తనకు మరణ మాసన్నమైనదని గ్రహించి, తనకు పుత్రులు లేనందున అల్లుడగు చంద్రవర్ణుని తన రాజ్యమునకు రాజు గావించినాడు. చంద్రవర్ణుడు తమకు రాజైనందుకు మంత్రులు, సైనికులు, ప్రజలు ఎంతో ఆనందించినారు.

చంద్రవర్ణుడు ధర్మము తప్పక రాజ్యపాలన చేయుచు ప్రజలందరి మెప్పు పొందగలిగినాడు. దేశవిదేశములలో మంచిపేరు సంపాదించినాడు. తనకు

తెలిసిన విద్యలన్నింటిని తన కుమారులకు బాగుగా నేర్పినాడు. కొన్నాళ్ళ కతనికి అంత్యసమయము దగ్గరైనది. అప్పుడతడు తన నలుగురు పుత్రులను పిలిచి వారి కనేక బుద్ధులు చెప్పినాడు. అందరిని ఐకమత్యముగా ఉండమని కోరినాడు. పిమ్మట వారిని దగ్గరకు పిలిచి "కుమారులారా! నా మాటలు శ్రద్ధగా వినుడు. మీ తల్లులను వివాహమాడుటకు ముఖ్యకారణము భర్తృహరి తల్లియగు అలంకారవల్లియే. కావునవాకు ఆమెయే పెద్ద భార్యయు, పట్టపురాణియు నగును. ఆమె గర్భమున పుట్టినవాడే నా సింహాసన మధిష్ఠించి రాజ్యపాలన చేయుటకు అర్హుడగును. కావున భర్తృహరికి ఈ రాజ్యమును పట్టము గట్టెదను. మీరు ముగ్గురు యువరాజులుగ ఉండి, అన్ని విషయములలో అతనికి తోడ్పడుచు రాజ్యమును చక్కగా పాలించుడు" అని చెప్పగా, "తండ్రీ! మీ ఆజ్ఞాను సార మట్లే చేసెదము" అని వాగ్దానము చేసిరి.

అంతడు చంద్రవర్ణుడు పురోహితులను పిలిపించి, శుభముహూర్తము పెట్టించి, ఆ ముహూర్తమున భర్తృహరికి పట్టము గట్టెను. ధర్మము తప్పక రాజ్యపాలన చేయుమని ఆశీర్వదించి ప్రాణము వదలెను.

తండ్రి మరణించిన తరువాత భర్తృహరి తన ముగ్గురు సోదరుల సహాయమున రాజ్యమును చక్కగా పాలించసాగెను. కొన్ని దినములు గడచిన తరువాత చంద్రవర్ణునకు బ్రాహ్మణకాంత వలన పుట్టిన పల్లవుడు మోక్షాపేక్ష గలవాడై సంసార సుఖములను త్యజించి, దండకమండలములు, కాషాయ వస్త్ర ములు ధరించి తపస్సు చేసికొనుటకు అరణ్యమున కేగెను.

తరువాత కొంతకాలమునకు భర్తృహరి భార్య దుష్ప్రవర్తనకు అసహ్యపడి రాజ్యమునకు విక్రమాదిత్యుని రాజుగను, భట్టిని ప్రధానమంత్రిగను ఏర్పరచి, సర్వసంగ పరిత్యాగియై అడవులకు పోయి తపమాచరించసాగెను.

విక్రమాదిత్యుడు రాజగుట

భర్తృహరి రాజ్యత్యాగము చేసిన పిమ్మట విక్రమాదిత్యుడు భట్టి సలహా, సహాయముల ననుసరించి చక్కగా రాజ్యపాలన చేయసాగెను. క్రమముగా వారికి తమ రాజ్యము పెంపొందించవలెనను తలంపు కలిగినది. అట్టి తలంపుతో విక్రమాదిత్యుడు తన చతురంగ బలములను ఎంతో అభివృద్ధి చేసెను.

ఒక శుభముహూర్తమున విక్రమాదిత్యుడు భట్టితో కలసి చతురంగ బలములను వెంటబెట్టుకొని తన పొరుగు దేశములపై దండయాత్ర సాగించి, అచ్చటి వీరులందరిని జయించెను. ఆ విధముగా విక్రమాదిత్యుడు ఛప్పన్న దేశములను జయించి, వారుతమకు కప్పములు చెల్లించుచుండునట్లు ఏర్పాటు చేసుకొని స్వదేశమునకు తిరిగివచ్చెను. ఆనాటి వీరులకు విక్రమాదిత్యుడు సింహస్వప్నమై భయము గొల్పసాగెను. భట్టి యొక్క యుద్ధతంత్రమునకు తోడు విక్రమాదిత్యుని శౌర్యపరాక్రమముల వలన వారి రాజ్యము ఆసేతుహిమాచల పర్యంతము వ్యాపించినది. విక్రమాదిత్యుడు రాజాధిరాజై ప్రకాశించసాగెను.

తరువాత భట్టీ విక్రమాదిత్యులు తమ రాజ్యమునకు రాజధానిగా మరియొక పట్టణమును నిర్మించవలెనని నిశ్చయించుకొనిరి. వింధ్య పర్వతములకు, గుణవతీనదికి సమీపమున నొక గొప్ప నగరమును నిర్మించిరి. అది దేవేంద్రుని నివాసస్థలమగు అమరావతివలె శోభించుచుండెను. దానిని నిర్మించుటకు పూర్వమచట గొప్ప కాళికాలయము ఉండెను. అది ఉజ్జయినీ మహాకాళీ ఆలయమని ప్రసిద్ధి పొందియుండెను. అందువలన వారు తమ రాజధానికి ఉజ్జయిని అను పేరునే ఉంచి, అందుండి రాజ్యపాలన చేయసాగిరి.

భట్టి విక్రమాదిత్యులిద్దరూ ఉజ్జయిని మహాకాళిని భక్తి శ్రద్ధలతో

భట్టి-విక్రమాదిత్యులు మహాకాళిని పూజించుట

సేవించుచుండిరి. దేవికి మూడు వేళలలో శాస్త్రీయముగా పూజలు చేయించుచుండిరి. ఘనముగ దీపధూప నైవేద్యములు అర్పించుచుండిరి. వారి పూజలకు మెచ్చి దేవి నవనిధులను ప్రసాదించెను. అన్నివేళల వారిని కాపాడుచుండెను. కాళికాదేవి అనుగ్రహామువలన విక్రమాదిత్యుడు తన సోదరుడును, ప్రధాన మంత్రియునగు భట్టి సహాయమున రాజ్యమును ఎంతో వైభవముగా పాలించుచుండెను.

రంభా-ఊర్వశులు తగవుపడుట

ఇట్లు జరుగుచుండగా దేవలోకమున ఇంద్రునిసభలో నృత్యముచేయు రంభ, ఊర్వశియను అప్సరసలు ఒకరికంటె ఒకరు గొప్పవారమని కీచులాడుకొనసాగిరి. తుదకు దేవేంద్రుని వద్దకుపోయి మా యిరువురిలో నృత్యము చేయుట యందు ఎవరు గొప్పవారో చెప్పవలెనని అడిగిరి. దేవేంద్రుడు ఏమి చెప్పవలెనో తోచక మునీశ్వరులతోను, దేవతలతోను సభ ఏర్పాటుచేసి, ఆ సభలో రంభను, ఊర్వశిని నాట్యముచేయ నాజ్ఞాపించి, సభలో నున్నవారి నుద్దేశించి వారిద్దరిలో నెవరు బాగుగా నాట్యము చేయగలరో నిర్ణయించి చెప్పమని కోరెను.

రంభా, ఊర్వశులిద్దరూ ఒకరిని మించినట్లు మరియొకరు వారినృత్యము చేసిరి. నృత్యముచూచిన దేవతలు, ఋషులు వారిద్దరిలో ఎవరు అధికులో, ఎవరు అధములో నిశ్చయించలేక "ఇరువురును బాగుగానే నృత్యము చేసిరి. మీలో ఒకరు గొప్పవారు, మరియొకరు తక్కువ వారని నిర్ణయించిచెప్పుటకు వీలుకాదు. కావున భేదబుద్ధి లేక అన్యోన్యముగా ఉండుము" అని చెప్పిరి. ఎవరు ఎంత నచ్చజెప్పినను రంభా, ఊర్వశులు పట్టిన పట్టు విడువలేదు. మా యిద్దరిలో ఎవరుగొప్పవారో తెలసంతవరకు మేము నాట్యము చేయమని చెప్పిరి.

విక్రమాదిత్యుడు దేవలోకమునకు వెళ్లుట

దేవేంద్రునకుగాని, సభలోనున్నవారికిగాని వారి పట్టుదల పోగొట్టు మార్గము తోచలేదు. ఇంతలో అచ్చటికి నారద మహర్షి వచ్చెను. ఆలోచనలో మునిగియున్న దేవేంద్రుని, సభలోని వారిని "ఏ విషయమును గూర్చి మీరింత

తీవ్రముగ ఆలోచించుచున్నారని" అడిగెను. దేవేంద్రుడు అసలు విషయమంతయు నారద మహర్షికి తెలిపెను.

అది విని నారదుడు "దేవేంద్రా! భూలోకమున ఉజ్జయినీ నగరము కలదు. దానిని మహాపరాక్రమవంతుడు, దానశీలుడు, మేధావి, సకల విద్యలలో సంపూర్ణపాండిత్యము గలవాడునగు విక్రమాదిత్యుడు పాలించుచున్నాడు. అతనిని పిలిపించి అడుగుము. వీరిద్దరిలో ఎవరుగొప్పవారో తేల్చి చెప్పగలడు" అని చెప్పెను.

దేవేంద్రుడు నారదమహర్షి సలహానునుసరించి ఉజ్జయినీ నగరమునకు రథమును పంపి క్షణములో విక్రమాదిత్యుని సభకు రప్పించెను. దేవేంద్రుడు విక్రమాదిత్యుని ఉచితరీతిన గౌరవించి, సభలోనున్నవారి నందరిని పరిచయము చేసి, ఉచితాసనమున కూర్చుండబెట్టి ఆయనను రప్పించుటకు కారణమేమో వివరముగా చెప్పెను. "విక్రమాదిత్యా! ఇప్పుడు నీయెదుట రంభ, ఊర్వశి నృత్యము చేయుదురు. అదిచూచి నృత్యము చేయుటలో వారిలోనెవరు శ్రేష్ఠులో నిశ్చయించి చెప్పుము" అని అడిగెను.

దేవేంద్రుని మాటలు విని విక్రమాదిత్యుడు ఆశ్చర్యానందములుపొంది తనకు కొంతవ్యవధి యిమ్మని కోరెను. దేవేంద్రుడు అందుకు అంగీకరించగా, విక్రమాదిత్యుడు సభనుండి ఒక ఉద్యానవనమునకు పోయి, కొన్నిపూవులను కోసి రెండు పూలచెండ్లను కుట్టెను. ఆ చెండ్లలో కొన్ని విషకీటకములను ఉంచెను. ఆ చెండ్లను ఒక వస్త్రమునచుట్టి సభలోనికి వచ్చికూర్చుండెను. రంభా ఊర్వశి "యిక నాట్యము చేయమందురా" అని అడిగిరి.

అంతట విక్రమాదిత్యుడు తన వెంట తెచ్చిన పూలచెండ్లలో నొకటి రంభకు, మరియొకటి ఊర్వశికి యిచ్చి "మీరు ఈపూలబంతులను చేబట్టినృత్యము

చేయుడు. మేము భూలోకమున యిట్లే పరీక్షింతుము" అని చెప్పెను. వారు అందుకు అంగీకరించి పూలచెండ్లను పట్టి నృత్యము చేయనారంభించిరి. రంభ తన చేతియందున్న పూలచెండును గట్టిగా అదిమిపట్టుకొనుటచే దానియందున్న విష కీటకములు చెదరి ఆమెనుకుట్టి బాధించసాగినవి. అందువలననామె నాట్యముచేయు టలో కొంత తడబడసాగినది. ఊర్వశి తనచేతియందున్న పూలచెండును మృదువుగా పట్టుకొని ఏ విధమైన బాధపొందక హాయిగా నాట్యము చేసెను.



దేవసభలో విక్రమాదిత్యుని ముందు రంభా, ఊర్వశి నృత్యము చేయుట

కొంత సేపు అట్లు వారి నాట్యప్రదర్శనము జరిగిన తరువాత దేవేం ద్రుడు విక్రమాదిత్యుని చూచి "వీరిద్దరిలో ఎవరు బాగుగా నాట్యముచేసిరి?" అనిఅడు గగా, "ఊర్వశి బాగుగా నాట్యము చేసినది" అని చెప్పెను.

అది విని దేవేంద్రుడు "ఆ విషయమును మీరు ఎట్లునిశ్చయించితిరి?" అని ప్రశ్నించగా, విక్రమాదిత్యుడు రంభను, ఊర్వశిని చూచి "మీకు నేనిచ్చిన పూలచెండ్లను నాకు యిండు" అని అడిగెను. రంభ నాట్యము చేయునప్పుడు దానిని క్రిందపడవేసెను. అందువలన తలవంచి నిలబడెను. ఊర్వశి తన చేతిలోనున్న చెండును విక్రమాదిత్యుని యెదుట పెట్టెను.

అప్పుడు విక్రమాదిత్యుడు దేవేంద్రుని చూచి "సురేంద్రా! వీరిరు వురిలో గలభేదములు గమనించితిరిగదా! రంభ నేనిచ్చిన పూలచెండును క్రింద పడ వేసెను. ఊర్వశి నేనుయిచ్చిన చెండును భద్రముగ పట్టుకొని నాట్యము చేసెను." అని చెప్పి, ఊర్వశి యిచ్చిన చెండును దేవేంద్రుని ముందువిప్పి అందున్న విష కీటకములను చూపించి "ఊర్వశి ఈ చెండును మృదువుగ పట్టుకొని ఉన్నందున ఇందున్న విషకీటకములు ఆమెను ఏమియు బాధించనందువల్ల ఆమె చక్కగా నాట్యము చేసినది. రంభ తన చేతియందుగలచెండును గట్టిగా అదిమిపట్టుకొనుటచే అందలి విషకీటకములు బాధకలిగి ఆమెనుకుట్టి బాధించసాగినవి. ఆ బాధవలన రంభ నాట్యము చేసినప్పుడు తికమకపడి తప్పటడుగులు వేసినది. విషకీటకముల బాధ భరించలేకనే ఆమె చెండును క్రిందపడవేసినది. కావున ఊర్వశియే గెలు పొందినదని నా నిశ్చయము" అని చెప్పెను.

విక్రమాదిత్యుని మాటలువిని దేవేంద్రాదులు అతని నిర్ణయము సరి యైనదే అని అంగీకరించి, ఊర్వశికి తగు బహుమతులిచ్చి గౌరవించిరి. వారు

యిద్దరిని పరీక్షించి తగు తీర్పునిచ్చిన విక్రమాదిత్యుని బుద్ధి బలసంపదను వేనోళ్ళ కొనియాడిరి.

దేవేంద్రుడు విక్రమాదిత్యుని బుద్ధిబలచాతుర్యములకు ఆనందించి, నవరత్నఖచిత స్వర్ణమయమగు సింహాసనమునొకటి బహూకరించి, "నీవీ సింహాసనముపై కూర్చుండి వేయిసంవత్సరములు రాజ్యపాలనచేయగల"వని వరమిచ్చి, ఆశీర్వదించి రథమున కూర్చుండబెట్టి ఉజ్జయినీ పట్టణమునకు పంపెను.

విక్రమాదిత్యుడు రథమును ఉజ్జయినీ మహాకాళి మందిరము వద్ద ఆపించి, దిగి, దేవేంద్రుడొసగిన సింహాసనమును అచ్చట పెట్టించి, గుడిలోనికి పోయి కాళికాదేవిని దర్శించి, సాష్టాంగ నమస్కారము చేసి తన కోటకు వెళ్ళెను.

విక్రమాదిత్యుని రాకవిని, భట్టి ఎంతో ఆనందించి తత్క్షణమే సోదరుని వద్దకుపోయి నమస్కరించి నిలబడెను. విక్రమాదిత్యుడు భట్టినిచేరబిలిచి, ప్రక్కను కూర్చుండబెట్టుకొని దేవలోకమున జరిగిన విశేషములు నన్నిటిని తెలిపెను. తరువాత విక్రమాదిత్యుడు భట్టితో "సోదరా! నాయందు దయవుంచి దేవేంద్రుడు యిచ్చిన సింహాసనము మన యిష్టదైవతమగు మహాకాళి మందిరము వద్దనున్నది. 'దానినధిష్టించి వెయ్యిసంవత్సరములు రాజ్యపాలన చేయుము' అని దేవేంద్రుడు వరమిచ్చి, నన్నాశీర్వదించెను. ఒకశుభముహూర్తమున దానిని మన కొలువుకూటమునకు తెప్పించి దానిపై నన్నధిష్టింపజేయుము" అని చెప్పెను.

విక్రమాదిత్యుని మాటలు విని భట్టి ఎంతో ఆనందించెను. కానిఅతనిలో నొక విచారముకలిగి యిట్లు అడిగెను- "రాజశేఖరా! మీరు మాత్రము వేయి సంవత్సరములుండునట్లు వరముపొంది వచ్చితిరి. కాని మీకు తోడునీడగనున్న నాకేమి తెచ్చితిరి? నా విషయమే మరచిపోయితిరా?" అని యడిగెను.

భట్టి మాటలు విని విక్రమాదిత్యుడు బాధపడి "తమ్ముడా! ఆ సమయమున నేను నిన్నేగాక, భూలోకమునే మరచిపోయితిని. ఇప్పుడు చింతపడిలాభము లేదు. నా పొరపాటుకు క్షమించుము. అన్యదా భావించక నాతోపాటు నీవు కూడ వేయిసంవత్సరములు బ్రతికియుండుటకేదైన ఉపాయమాలోచింపుము" అని చెప్పెను.

రాజు మాటలు విని భట్టి తనలో, "జరిగిన దానికిపుడు చింతించి ప్రయోజనములేదు. జరుగవలసిన దానిని గూర్చి ఆలోచించుట మంచిది" అనుకొని, రాజువద్ద శలవు తీసికొని తన భవనమునకు పోయి, భోజనమైనను చేయక మంచముపై పరుండి దీర్ఘముగ ఆలోచించసాగెను. అతడు ఆ విధముగ ఆలోచించి తన ఇష్టదేవతయగు కాళి అనుగ్రహము పొంది తన కోరిక తీర్చుకొనవలెనని నిశ్చయించుకొనెను.

మహాకాళి భట్టికి వరములిచ్చుట

అట్లు నిశ్చయించుకొని భట్టి మరునాడు అర్ధరాత్రి సమయమున పూజాద్రవ్యములను తీసుకొని కాళీ మందిరమునకు పోయెను. ఆ సమయమున మహాకాళి నగర సంచారమునకు వెళ్ళెను. ఆలయములో దేవి లేకుండుటను చూచి, గుడిలో నొక శుభ్రమైన స్థలమున పద్మాసనమువేసి కూర్చుండి భక్తి శ్రద్ధలతో దేవీ మంత్రమును పఠించసాగెను.

ఇట్లు చేయుచుండగా మహాకాళి నగర సంచారము పూర్తిచేసి తిరిగి ఆలయమునకు వచ్చెను. ఆమె తనను స్తుతించుచు, మంత్రములు చదువుచు పూజచేయుచున్న భట్టిని చూచి దగ్గరకువెళ్ళి "కుమారా! ఈ యర్ధరాత్రి సమయమున ఒంటరిగా వచ్చి నన్ను పూజించుటకు కారణమేమి? ఏమి కోరి నీ విట్లు

చేయుచున్నావు? నీవు నా భక్తుడవు కావున నీ కోరిక తీర్చుట, కష్టములు తొలగించుట నా విధి! నీ కేమి కావలెనో కోరుకొనుము. యిచ్చెదను" అని పలికెను.

జగజ్జనని మాటలు విని భట్టి ఎంతో సంతోషించి, విక్రమాదిత్యుడు దేవలోకమునకు వెళ్ళినది మొదలు అంతవరకు జరిగిన సంగతులన్నియు పూసగ్రుచ్చినట్లు చెప్పి "లోకమాతా! నా సోదరుడు వేయిసంవత్సరములు రాజ్యపాలన చేయునట్లు దేవేంద్రుని వలన వరము పొంది వచ్చినాడు. నా విషయము మరచి పోయినాడు. ఆయనను విడిచి నేను, నన్ను విడిచి ఆయన బ్రతుకజాలము. ఆయనతోపాటు కొంతకాలము రాజ్యపాలన చేయవలెనను కోరిక నాకు గాఢముగా కలదు. కావున నేను రెండువేల సంవత్సరములు జీవించునట్లు వరము అనుగ్రహింపుము" అని ప్రార్థించెను.

అతని ప్రార్థన విని కాళికాదేవి "నీవు విక్రమాదిత్యుని తల నరికి తెచ్చి బలిపీఠమున నుంచిన నీవు కోరిన వరమిచ్చెద"నని చెప్పెను. దేవి మాటలు విని భట్టి కొంతసేపు ఆలోచించి, పరుగు పరుగున పోయి గాఢనిద్రలో మునిగి యున్న విక్రమాదిత్యునిలేపి, జరిగిన విషయము చెప్పగా "తమ్ముడూ! నీవు వెంటనే దేవి కోరినట్లు చేయుము" అని పలికి శిరము వంచెను. భట్టి దేవిపై భారము వేసి ఖడ్గముతో విక్రమాదిత్యుని శిరస్సును ఖండించి మహాకాళి గుడికి పోయి దానిని బలిపీఠమున నుంచెను.

దానిని చూచి దేవి ఆనందించి "నీవు కోరిన వరము యిచ్చితిని సుఖంగా రెండువేల సంవత్సరములు జీవించి రాజ్యపాలన చేస్తూ ఖ్యాతిపొందుము" అని చెప్పగా, భట్టినవ్వి "తల్లీ! దేవేంద్రుడంతనివాని నుండి వేయిసంవత్సరములు రాజ్యపాలన చేయమని వరము పొందిన నా అన్నగతి యిట్లయినది. ఇక నా సంగతి ఏమగునో?" అని అడుగగా, దేవి సంతోషించి "వత్సా! నీకు గ

తెలివి తేటలకు, చాతుర్యమునకు, నా యందు గల భక్తికి ఎంతో ఆనందించి వర మిచ్చితిని. నేనిచ్చిన వరమెన్నటికిని వృధాకాదు. నీ మరియొక వరమేదైన అడుగుము, యిచ్చెద"ననగా, భట్టి పరమానందభరితుడై "తల్లీ! విక్రమాదిత్యుడు లేకుండా నేను జీవించలేను. కావున అతనిని బ్రతికింపుము" అని కోరెను.

మహాకాళి భట్టికి గల సోదరప్రేమకు ఆనందించి వెంటనే విక్రమాదిత్యుని బ్రతికించి "సుఖముగా జీవించు"డని ఆశీర్వదించి పంపెను.

ఇంటికి వెళ్ళిన తరువాత విక్రమాదిత్యుడు భట్టిని చూచిసోదరా! నేను దేవేంద్రుని నుండి వెయ్యి సంవత్సరములు జీవించునట్లు వరము పొందితిని. నీవు కాళీమాత వలన రెండువేలేండ్లు జీవించునట్లు వరము పొందితివి. నన్ను వదలి ఒక క్షణమైనను గడపలేని నీవు నేను మరణించిన తరువాత వేయి సంవత్సరములు బ్రతికి యుండగలవా?" అని అడిగెను.

అది విని భట్టి నవ్వి "రాజా! నాతోపాటు నీవుకూడ రెండువే సంవత్సరములు జీవించవచ్చును. దేవేంద్రుడు నీకు యిచ్చిన వరము వెయ సంవత్సరములు రాజ్యపాలన చేయుదువని గదా! నేను కాళీమాత వలన రెం వేల సంవత్సరములు జీవించునట్లు వరము పొందితిని. నీవు సంవత్సరమునక ఆరు మాసములు రాజ్యపాలన చేయుము. మిగిలిన ఆరు మాసములు వినోద యాత్రలతో, తీర్థయాత్రలతో గడుపుచుండుము. నీవు ఆ విధముగా వెళ్ నప్పుడు రాజ్యపాలన నేను చేయుచుందును. ఇట్లు చేసినచో నాతోపాటు నీ కూడ రెండువేలయేండ్లు జీవించగలవు. దేవేంద్రుడిచ్చిన వరము ప్రకారమ వెయ్యి సంవత్సరములు మాత్రమే రాజ్యపాలన చేసినట్లగును. ఇదీ నాకుతోచిన ఉపాయము. అటుపై మీ ఇష్టము" అని చెప్పెను.

భట్టి చెప్పిన మాటలు విని విక్రమాదిత్యుడు అమిత సంతోషము

పొంది, తమ్ముని కౌగలించుకొని "సోదరా ! నీ బుద్ధి బలచాతుర్యములు కొనియాడ దగినవి. నీవు సూచించిన పద్ధతి ప్రకారము రాజ్యపాలనచేసి రెండువేలేండ్లు కలసి మెలసి ఉందము" అని పలికెను.

విక్రమాదిత్యుడు ఆనాటి నుండి సంవత్సరములో ఆరు మాసములు రాజ్యపాలన చేయుచు, మిగిలిన ఆరుమాసములు విలాసయాత్రలు, తీర్థ యాత్రలు, వేటాడుట మొదలగు పనులు చేయుచు గడుపుచుండెను. విక్రమా దిత్యుడు నగరములో లేని ఆరు మాసములు భట్టి రాజ్యపాలన చేయుచుండెను. ఈ విధముగా, భట్టీ-విక్రమాదిత్యులు రాజ్యమును పరిపాలించుచు ప్రజలకు సుఖశాంతులు కలిగించుచుండిరి. దేవేంద్రుడొసగిన నవరత్న ఖచితమయ స్వర్ణ సింహాసన మధిష్టించి వారు ధర్మము తప్పక రాజ్యపాలన చేయుచు, దేశ విదేశములలో గొప్ప ఖ్యాతి నందుచుండిరి.

భే తా ళు ని క థ

ప్రాచీనకాలమున పరమేశ్వరుడు పార్వతీదేవితో ఏకాంతముగనున్న పుడు ఒకనాడు, రాత్రిసమయమున పార్వతీదేవి పరమేశ్వరునకు నమస్కరించి "నాథా! ఈలోకములో ఎవరికినీ తెలియని చిత్రవిచిత్రమైన కథలేవైన చెప్పుడు" అని ప్రార్థించెను. పార్వతీదేవి కోరికవిని పరమేశ్వరుడు ఆనందించెను. "దేవీ! నీవు కోరిన ప్రకారము ఇంతవరకు ఎవరికినీ తెలియని చిత్రవిచిత్రమైన కొన్ని కథలు చెప్పెదను. విని ఆనందించుము" అని సూర్యోదయము వరకు కొన్ని కథలు చెప్పి ముగించెను.

ఆ రాత్రి సమయమున పరమేశ్వరుని పూజించుటకొక బ్రాహ్మణుడు వచ్చియుండెను. అతడు పూజానంతరము ఇంటికిపోక గుడి సమీపమున నొకచోట

రహస్యముగ నక్కియుండెను. అట్లు నక్కియున్న బ్రాహ్మణుడు పార్వతీదేవికి పరమేశ్వరుడు చెప్పిన కథలన్నిటిని చక్కగా విని, ఇంటికిపోయి భార్యకు చెప్పెను. అతని భార్య ఆ కథలను యిరుగుపొరుగు స్త్రీలకు చెప్పెను.

పార్వతీదేవికి పరమేశ్వరుడు కథలు చెప్పుట
వానిని చాటున ఉండి బ్రాహ్మణుడు వినుట

ఈ విధముగా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన కథలు లోక మంతట తెలిసిపోయినవి. ఆ సంగతి పార్వతీదేవికి తెలసినది. చిరుకోపము చెంది,

పరమేశ్వరునిచూచి "స్వామీ! మీరు నాకు ప్రపంచంలో ఎవ్వరికీ తెలియని చిత్ర విచిత్రమైన కథలు చెప్పెదమని మాటయిచ్చి లోకమంతటా చెప్పుకొనబడుచున్న కథలే చెప్పినారు. మీరిట్లు అబద్ధమాడుట ధర్మమగునా?" అని అడుగగా, పరమేశ్వరుడు ఆగ్రహము పొంది, దివ్యదృష్టిచే ఆ కథలు ఒక బ్రాహ్మణుడు రహస్యముగ తాము చెప్పుకొనుచున్నప్పుడు విని బయటపెట్టినాడని తెలిసికొని, ఆబ్రాహ్మణుని రప్పించి, "నేను పార్వతికి రహస్యముగ చెప్పినకథలు నీవు మా ఆజ్ఞ లేక బట్టబయలు చేసితివిగాన నీవు తక్షణము పిశాచమగుదువుగాక!" అని శపించెను.

పరమేశ్వరుని శాపము విని బ్రాహ్మణుడు గజగజ వణకుతూ "దేవదేవా! నా అపరాధము క్షమించి, శాపవిముక్తి కలుగుమార్గము తెలుపుడు" అని ప్రార్థించగా నందికేశ్వరుడు యిట్లుచెప్పెను- "కొంతకాలము గడచినతరువాత భూలోకమున విక్రమాదిత్యుడను రాజు జన్మించి చిరకాలము రాజ్యపాలనచేయును. ఆ రాజొక రుషికోరిక తీర్చుటకై నీవద్దకు వచ్చును. అప్పుడతనికి ఈ కథ లన్నియు చెప్పిన పిమ్మట శాపవిముక్తుడవగుదువు" ఆమాటలు విని బ్రాహ్మణుడు కొంత తృప్తిపడెను. తరువాత కొంతసేపటికి పిశాచముగమారి, అరణ్యమునకేగి ఒక వృక్షముపై నివసించుచుండెను.

శాంతశీలుండను యోగి విక్రమాదిత్యుని వద్దకు వచ్చుట

ఇది జరిగిన కొన్ని వేల సంవత్సరములకు విక్రమాదిత్యుడు జన్మించెను. అతడు ఉజ్జయిని రాజధానిగా చేసికొని, భట్టి సహాయమున ఎంతో వైభవముగా రాజ్యమును పాలించుచుండెను.

ఇట్లు విక్రమాదిత్యుడు ఉజ్జయినిని పాలించుచున్న సమయమున శాంతశీలుడను నొకరుషి రాజును దర్శించుటకు వచ్చెను. అతడు రాజును దర్శించి

తనవెంట తెచ్చిన ఒక దానిమ్మపండును యిచ్చెను. రాజు దానిని తినకుండ, జాగ్రత్తపెట్టుడని రాజభటుల నాజ్ఞాపించెను. శాంతశీలుడు ప్రతిదినము రాజును దర్శించుటకు వచ్చినపుడెల్ల ఒక దానిమ్మపండునిచ్చి పోవుచుండెను. రాజు వాటిని తినక సభయందే వదలిపోవుచుండెను. రాజభటులు ఆ పండ్ల నన్నిటిని భద్రముగ తీసి ఒకచోట దాచుచుండిరి.

అట్లు జరుగుచుండగా ఒకనాడు శాంతశీలుడు యిచ్చిన దానిమ్మపండును ప్రక్కన కూర్చుండియున్న తన కుమారునిచేతికి యిచ్చెను. తలవని తలంపుగా అచ్చటికొక కోతివచ్చి బాలుని చేతిలోనున్న పండు నపహరించి, కొరికి తినబోగా ఆ పండునుండి జలజల రత్నములు రాలెను. వానిని చూచి రాజు ఆశ్చర్యపడి ఇంతకుముందు ఆ ఋషి యిచ్చిన పండ్లనుతెమ్మని భటుల కాజ్ఞయిచ్చెను. రాజ భటులు జాగ్రత్తగ దాచిన పండ్లనన్నిటిని తెచ్చి రాజుముందు పెట్టినారు. రాజు ఆ పండ్లనన్నిటిని పగులగొట్టించి చూడగా అన్నిటిలో వెలగల రత్నములు ఉండెను. వాటిని చూచి రాజు ఆశ్చర్యానందములు పొందెను.

మరునాడు శాంతశీలుడు యథాప్రకారము రాజును దర్శించుటకు వచ్చి, ఒక దానిమ్మపండు నిచ్చెను. అప్పుడు విక్రమాదిత్యుడు ఆ ఋషినిచూచి "స్వామీ! మీరు ప్రతిదినము నావద్దకు వచ్చి, నన్ను ఆశీర్వదించి వెళ్ళుచున్నారు. మీరిట్లు వచ్చుటకేదైన కారణముండి యుండును. ఆ కారణమేదో తెలుపుడు. నా వలన మీకు కావలసినపని ఏదైనఉన్నచో చెప్పుడు. తప్పక చేసెద"నని పలికెను.

అది విని శాంతశీలుడు "మహారాజా! నేనపరపక్ష ద్వాదశినాడు అర్ధ రాత్రి సమయమున శ్మశానమునందు యాగము చేయదలచితిని. మీరు ఒంటరిగా వచ్చి నాయాగము పూర్తియగునట్లు సహాయపడవలె"నని కోరెను. విక్రమాది త్యుడు అందుకు అంగీకరించెను.

విక్రమాదిత్యుడు ఋషికి చెప్పిన ప్రకారము అపరపక్ష ద్వాదశినాడు, అర్థరాత్రి సమయమున ఒంటరిగా నొకఖడ్గమును పట్టుకొని శ్మశానమునకు పోయి శాంతశీలుని ముందు నిలబడెను.

అప్పుడా శాంతశీలుడనుఋషి ప్రేతముఖమునందు హోమముచేయుచు, రాజునుచూచి ఎంతో ఆనందించి, "ఓ సత్యసంధుడా! మంచి సమయమునకు వచ్చితివి. ఇక్కడికి దక్షిణ పార్శ్వంబున నొకపెద్ద మఱ్ఱిచెట్టు గలదు. ఆ చెట్టుపై

విక్రమాదిత్యుడు భేతాళుని పట్టి బంధించి తెచ్చుట

నొక బేతాళమున్నది. దానిని నీవు పట్టితేవలెను. నీవు దానిని పట్టితెచ్చునప్పుడు దానితో నీవు మాట్లాడకూడదు" అని చెప్పెను.

రాజు "అట్లే చేసెద"నని, కొరవి చేతబట్టుకొని ఒంటరిగా ఆ చెట్టు వద్దకు వెళ్ళి చెట్టుపైనున్న భేతాళుని చూచెను. అప్పుడా భేతాళుడు తలక్రిందుగా కాళ్ళుమీదుగా వ్రేలాడుచుండెను. రాజు దానినిచూచి ఏ మాత్రము భయపడక, చెట్టుమీదికి పోయి, భేతాళుని ఈడ్చి క్రిందకుత్రోసి తాను చెట్టుదిగుసరికి ఆ భేతాళుడు నవ్వుచు నిముషములో పై కెగసి ముందువలె వృక్షమును పట్టుకొని వ్రేలాడుచుండెను.

అంతట రాజు మరల చెట్టుపైకిపోయి భేతాళునిపట్టి తన ఉత్తరీయముతో కట్టి వీపుపైనుంచుకొని క్రిందికి దిగివచ్చెను. అప్పుడు భేతాళుడు తన శాపవిమోచన సమయము దగ్గరైనదని తలచి "ఓ మహారాజా! శీఘ్రముగా త్రోవ జరుగుటకై నేనొక కథ చెప్పెదను విను"మని క్రింది విధముగా కథ చెప్పుచుండ విక్రమాదిత్యుడు మౌనముగా నుండి వినుచు, పోవుచుండెను.

భేతాళుడు చెప్పిన-పద్మావతి కథ

"ఓ రాజా! గంగానదీ తీరమున తంజనగరమను నొకసుందరమైన పట్టణము కలదు. దానిని ప్రతాపుడు అనురాజు పాలించుచుండెను. అతనికిప్రభావతి యను భార్యయు, వజ్రముఖుడను కుమారుడును ఉండిరి. అతని మంత్రి కార్య ప్రధానుడనువానికి సద్బుద్ధియను నొకకుమారుడు కలడు. అతడు సకలవిద్యలు తెలిసినవాడు. రాజకుమారుడగు వజ్రముఖుడును, మంత్రిపుత్రుడగు సద్బుద్ధియు గాఢమగుస్నేహము కలిగి ఒకరినొకరు విడిచియుండక కలసిమెలసి ఉండెడివారు.

ఇట్లు జరుగుచుండగా ఒకనాడు రాజకుమారుడు సుబుద్ధితోకలసి వేటకు పోయెను. వారు అడవిలో చాలసేపు వేటాడి అలసిపోయిరి. దాహముతో బాధ పడుచు వెదకి వెదకి యొకచెరువును చూచి, కడుపార నీరుద్రాగి దాహము తీర్చు కొనిరి. అచ్చటనున్న నీడలో కూర్చుండి విశ్రాంతి తీసుకొనుచుండిరి.

అప్పుడచ్చటికి మిక్కిలి అందగత్తెయగునొక యువతి చెలికత్తెలతో కలసి వనవిహారమునకు వచ్చెను. రాజకుమారుడు ఆమె అందచందములు చూచి ముగ్ధుడై మోహించెను. ఆ యువతి కూడ రాజకుమారుని చక్కదనమును చూచి ముగ్ధురాలై అతనిని మోహించెను. ఆమె తన మోహము తన దగ్గరనున్న చెలి కత్తెలకు, అతని వద్దనున్న చెలికానికి తెలియకూడదని భావించి, రాజకుమారుడు చూచునట్లు తన శిరమునందున్న తామరపూవునుతీసి కర్ణమునబెట్టి, పండ్లు కఱచు కొని, తరువాత కాలుత్రొక్కి మరల పాదంబుననిడుకొని, పిదప రొమ్మున బెట్టు కొనెను. ఈ విధముగ గుర్తుచూపి ఆ తటాకమున కొంతసేపు చెలికత్తెలతోకలసి జలక్రీడలాడి యింటికి పోయెను.

ఆమె యింటికి పోయినతరువాత రాజకుమారుడు తీవ్రమైన విచార ములో మునిగిపోయెను. సుబుద్ధి అతడట్లుండుటకు కారణము గ్రహించి "చెలికాడా! ఆమె నిన్ను రమ్మనెనుగదా! నీవెందుకు విచారపడుచున్నావు?" అని అడిగెను. సుబుద్ధి మాటలువిని రాజకుమారుడు ఆశ్చర్యపడి "మిత్రమా! ఆమె నన్ను రమ్మని చెప్పినట్లు ఏ ఆధారముపై నీవు చెప్పుచున్నావు?" అని ప్రశ్నించెను.

అప్పుడు సుబుద్ధి "మిత్రమా! ఆమె తనఅభిప్రాయమును ఇతరులకు తెలియకుండా నీకు కొన్ని గుర్తులద్వారా తెలిపెను. ఆగుర్తుల భావమేమో చెప్పె దను వినుము. ఆయువతి తనతలయందున్న పుష్పమును తీసి కర్ణమునందుంచు కొనుటద్వారా తనఊరు కర్ణపురమని, పండ్ల కరచుట ద్వారా బలముగలవాని

కుమార్తెనని, కాలు త్రొక్కుటద్వారా ఆ పురమునేలు రాజు కాళింగుడని, పాదము మీద ఉంచుకొనుట ద్వారా తనపేరు పద్మావతియని, వక్షమున నొత్తుకొనుట ద్వారా తనను కౌగలించగోరుచున్నట్లు ఉపాయముతో చెప్పినది. కావున నీవు విచారపడవలసిన పనిలేదు. ఆమె నిన్నుకలిసికొన గోరుచున్నదిగాన సంతోషముగా ఉండుము" అని తెలిపెను.

సుబుద్ధి మాటలువిని రాజకుమారుడు ఎంతో సంతోషించి, అతనిని వెంటబెట్టుకొని కర్ణపురమునకు పోయెను. అచ్చట వారొక ముసలిదానియింట బస చేసిరి.

వారా ముసలిదానిని మంచిచేసుకొని, విశేషధనమిత్తుమని ఆశపెట్టి పద్మావతివద్దకు పంపిరి. వృద్ధవనిత పద్మావతివద్దకు పోయి "నీవు చెరువువద్ద చూచిన రాజకుమారుడును, అతని స్నేహితుడును మన పట్టణమునకు వచ్చి నా యింట బసచేసినారు. రాజకుమారుడు నీకీ విషయము తెలియజేయగోరినందున వచ్చితిని" అని చెప్పగా, పద్మావతి యావృద్ధురాలిపై కోపించుచున్నట్లు నటించి "నీవు నాయింటికి మరెన్నడునురావద్దు"అని మందలించి యొకపుటికలో నా ముసలి దానిని కూర్చుండబెట్టి, పుటికకు త్రాడుకట్టి మేడమీదనుండి క్రిందికి దింపిపొమ్మని చెప్పెను.

ఆ వృద్ధురాలు యింటికివచ్చి వారితో జరిగిన సంగతులు చెప్పెను. ఆ సంగతులు విని రాజకుమారుడు దిగులుపడి సుబుద్ధివైపు దీనముగా చూడసాగెను. అప్పుడు సుబుద్ధి చిరునవ్వునవ్వి "మిత్రమా! ఆమె చాల తెలివైనది కావున తన ప్రవర్తన యితరులకు అర్థముకాకుండునట్లు తన అభిప్రాయములను యుక్తిగా తెలుపుచున్నది. ఆమె నీవు వచ్చిన సంగతివిని, ఏమియు యెరుగనట్లు ఆ ముసలి దానివద్ద నటించినది. ఆమె చేసిన చేతలద్వారా నీకు ఉపాయము చెప్పి పంపినది.

అర్ధరాత్రివేళ మేడక్రిందుగ జారవేసియున్న త్రాడును కదలించితివేని, ఆ సంజ్ఞ తెలుసుకొని ఆమె నిన్ను మేడపైకి చేదుకొనును. కావున నీవీ రాత్రి వెళ్ళి అట్లు చేయుము" అని చెప్పెను.

అదివిని రాజకుమారుడు ఎంతో ఆనందించి ఆనాటి అర్ధరాత్రి సమయమున పద్మావతి యున్నమేడవద్దకు వెళ్ళి త్రాడును కదలించగా, ఆమె గ్రహించి వెంటనే పైకిచేదుకొని, యతనితో సుఖముగా కాలము గడుపుచుండెను.



పద్మావతి మేడపై నుండి త్రాడు ద్వారా రాజకుమారుని పైకి లాగుకొనుట

ఇట్లు కొన్నిదినములు గడచిన తరువాత రాజకుమారునకు తన స్నేహితుడు జ్ఞాపకమునకు వచ్చెను. అప్పుడతడు 'అయ్యో! నామిత్రుడు సుబుద్ధి ఏమైనాడో, ఎట్లున్నాడో తెలిసికొనవలె'నని నిశ్చయించుకొని, పద్మావతితో నా మిత్రుని యోగక్షేమములు తెలుసుకొని వచ్చెదనని చెప్పగా, ఆమె అతడువెళ్ళి తిరిగివస్తాడో, రాడో అని సందేహపడి వెళ్ళవద్దని కోరెను. ఆమె అట్లు చెప్పగా రాజకుమారుడు తీవ్రవిచారము పొంది, ఆమెతో ముందువలె సంతోషముగా ఉండకుండెను.

అది గమనించి ఆమె రాజకుమారుడు తన చెప్పుచేతలలో ఉండవలెనన్న మంత్రి కుమారుని లేకుండ చేయవలెనని నిశ్చయించుకొని ఏమియు యెరుగనట్లు నటించుచు, రాజకుమారుని చేతికి కొన్ని మిఠాయిలు యిచ్చి "వీనిని తీసుకొని వెళ్ళి మీ స్నేహితునకు పెట్టుడు. మీరు మాత్రం తినవద్దు. అతనిని చూచి యోగక్షేమములు తెలుసుకొని, మీతోపాటు తీసుకొని రండు!" అని చెప్పినది.

పద్మావతి మాటలు విని రాజకుమారుడు చాల సంతోషించి, ఆమె యిచ్చిన మిఠాయిలను తీసుకొని తెల్లవారు ఝామున మేడక్రిందికి దిగి, తాము బసచేసిన ముసలిదాని యింటికి పోయెను.

అచ్చట సుబుద్ధి క్షేమముగా ఉండెను. ఒకరినొకరు చూచుకొని యెంతో ఆనందించిరి. రాజకుమారుడు జరిగిన సంగతులన్నియు చెప్పి పద్మావతి యిచ్చిన మిఠాయిలు అతనికి యిచ్చెను.

సుబుద్ధి ఆ మిఠాయిలను తీసుకొని "మిత్రుడా! నేను ఇచ్చట ఉన్న సంగతి ఆమెకెందుకు చెప్పితివి? ఆమె నీ నుండి నన్ను దూరము చేయదలచియే ఈ మిఠాయిలు నీతో పంపినది." అనగా, రాజకుమారుడు ఆమె మంచి గుణవంతురాలని, నిన్ను ఒకసారి చూచి గౌరవించదలచుచున్నదని చెప్పెను.

అది విని, సుబుద్ధి రాజకుమారుని చేతిలోనున్న మూటనుండి ఒక భక్ష్యమును తీసి ఒక కుక్కముందు వేసెను. ఆ భక్ష్యమును తిన్న తక్షణము ఆ కుక్క మరణించినది. దానినిచూచి రాజకుమారుడు ఆశ్చర్యచకితుడైనాడు. స్త్రీలను నమ్మరాదని తలచి, పద్మావతిపై గల మోహమును తొలగించుకొన దలచినాడు.

అప్పుడు సుబుద్ధి రాజకుమారుని చూచి "మిత్రుడా: మనమీ పట్టణమున ఉండుట క్షేమముకాదు. పద్మావతి నెట్లయిన తీసుకొని మన పట్టణము నకు పోవలెను. అందుకు ఒక ఉపాయము తెల్పెదను వినుము. నీవీ రాత్రి పద్మావతి యింటికి తిరిగి వెళ్ళుము. ఆమెతో యధాప్రకారము సరససల్లాపము లాడుచు సంతోషముగా ఉన్నట్లు గడుపుము. ఆమె గాఢనిద్రలో నున్న సమ యమున నా యువతి వక్షమున గోటితో మూడు గాయములు చేసి, ఆమె మెడలో నున్న రత్నాలహారమును తీసుకొనిరమ్ము. తరువాత జరుపదగిన పనులను జరుపుద"మని చెప్పెను.

సుబుద్ధి చెప్పిన ప్రకారము రాజకుమారుడు ఆనాటి రాత్రి ప్రభావతి వద్దకుపోయి, అతడు చెప్పినట్లుచేసి రత్నాలహారమును తెచ్చెను. తరువాత సుబుద్ధి యోగివేషము ధరించి స్మశానమునకు పోయి, అచ్చట ఉండి, రాజ కుమారుని తన శిష్యుడుగా ఉండునట్లు ఒప్పించి, ఆ హారమును పట్టణములోని వారికి చూపించి, దానిని కోరిన వారిని తన వద్దకు తీసుకొని రమ్మని చెప్పెను.

రాజకుమారుడు ఆ రత్నాలహారమును పట్టుకొని పట్టణములో తిరుగుచు అందరికి చూపుచుండెను. ఆ సంగతిరాజు విని, అతనిని తన వద్దకు రప్పించుకొని, "ఈ హారము వెల ఎంత?" అని యడుగగా, నతడు "నాకు తెలియదు. ఆ విషయము నా గురువు నడుగుడు. ఆయన ఇచ్చటికి సమీపములో నున్న శ్మశానములో జపము చేసికొను చున్నా"డని చెప్పెను.

అది విని రాజు అతని వెంట బయలుదేరి శ్మశానములో జపము చేయుచున్న యోగి వేషమున నున్న సుబుద్ధి వద్దకు పోయి తనకు ఆ హారము యిమ్మని అడిగెను. అప్పుడా సన్యాసి "ఓ రాజా ! మాకు ఈ హారముయొక్క వెల యివ్వవలసిన అవసరములేదు. మేము అనేక దినములనుండి యిచ్చట నివసించుచున్నాము. మీ మంత్రి కుమారుడు ప్రతిదినము ఈ శ్మశాన వాటికకు వచ్చి పీనుగులను తినుచుండును. ఇట్లుండగ నిన్నరాత్రి మంత్రి కూతురు వచ్చి ప్రేతములను తినుచున్నది. నిన్నటి దిన మా యువతిని నా శూలముతో పొడిచి ఆమె యురమున నున్న రత్నాలహారమును తీసుకొంటిని. అటుపిమ్మట నా యువతి తన గృహమున కేగినది. కావున ఆ రాక్షసకాంత ఈ పట్టణమున ఉన్న యెడల గొప్పకీడు సంభవించ గలదు. స్త్రీలను చంపుట పాపము కనుక ఆమె కండ్లకు గంతలు కట్టి కారడవిలో విడిచిపెట్టుట మంచిది" అని చెప్పి హారమును రాజుకు యిచ్చెను.

తరువాత రాజు కోటకు పోయి తనవద్దకు మంత్రిని పిలిపించి "ఈ హార మెవ్వరి"దని యడుగగా, మంత్రి దానిని చూచి గుర్తించి "నాకుమార్తె"దని తెలిపెను. అప్పుడు రాజు యోగి చెప్పిన విషయములన్నియు మంత్రికి చెప్పి, ఆ యువతి రొమ్ముపై పడిన గాయములను పరిశీలింపచేసెను. మంత్రి ఆ వ్రణములను చూచి భయపడి రాజాజ్ఞననుసరించి ఆమె కండ్లకు గంతలు కట్టించి కారడవిలో విడిచిపెట్టించెను.

ఇట్లు జరిగిన తరువాత సుబుద్ధియు, రాజకుమారుడు తమ వేషములను తీసివేసి, మామూలు దుస్తులు ధరించి, కారడవికిపోయి పద్మావతిని కలుసుకొనిరి.

సుబుద్ధి సలహాపై రాజకుమారుడు ఆమెను తీసుకొని తన రాజ్యమున కేగి సుఖముగా ఉండెను.

ఓ విక్రమాదిత్యా! కథ వింటివి గదా! ఈ పాప మెవరికి చెందును? తెలిసి చెప్పకుంటివేని నిన్ను మ్రింగివేయుదు"నని భేతాళుడు చెప్పగా, విక్రమాదిత్యుడు అతని మాటలు విని, సంతోషించి "రాజకుమారుడు యౌవనావస్థలో నున్న వాడు కావున ఆ యువతిని ప్రేమించినాడు. రాజకుమారుడు అందగాడగుటచే నా యువతి ప్రేమించి, అతనితో రహస్యముగా సుఖించినది. మంత్రి కుమారుడు స్నేహధర్మము ననుసరించి రాజకుమారునకు సహాయపడినాడు. రాజు చక్కగా విచారించక పద్మావతిని అడవికి పంపినాడు కావున ఆ పాపము రాజుకు చెందును" అని విక్రమాదిత్యుడు చెప్పగా, భేతాళుడు సంతోషించి, అతనికట్లనుండి తప్పించుకొని మాయమైపోయి మరల వటవృక్షముపై నిలిచెను.

భేతాళుడు చెప్పిన బ్రాహ్మణకన్య కథ

పరాక్రమవంతుడగు విక్రమాదిత్యుడు వెంటనే ఆవటవృక్షముపైకి పోయి మరలభేతాళుని పట్టి బంధించి తన వీపుపై కట్టుకొని, ముని వద్దకు వచ్చుచుండగా భేతాళుడు రాజు నుద్దేశించి "ఓ విక్రమాదిత్య మహారాజా! నేనొక ఆశ్చర్యకరమైన కథ చెప్పుచున్నాను వినుము.

విశ్వావసుడను నొక బ్రాహ్మణుడు కలడు. అతడు వేదశాస్త్రములు బాగుగా చదివినవాడు. అతనికి లేకలేక ఒక కన్య కలిగెను. ఆ కన్యక మిక్కిలి సౌందర్యముగా ఉండెను. తల్లితండ్రులు తగిన వరుని చూచి ఆమెకు వివాహము చేయవలెనని నిశ్చయించుకొనిరి.

ఇట్లుండగా వారి యింటికి ముగ్గురు అందమైన బ్రాహ్మణ యువకులు వచ్చి, ఆ కన్య యొక్క అందచందములు చూచి ముగ్ధులై ఆమెను వివాహమాడ గోరిరి. తాము నేర్చిన విద్యలను గూర్చి విశ్వావసునకు చెప్పుకొనిరి. విశ్వావసుడా ముగ్గురు యువకులను పరీక్షించి, ఆ ముగ్గురునూ సమర్థులే యని దృఢపరచుకొని, వారిని చూచి "మీరు ముగ్గురూ మాకు నచ్చినారు. కావున మీలో ఎవనికి మా కన్యనిచ్చి వివాహముచేయవలెనో మేము నిశ్చయించుకొనలేకున్నాము. మీరు ముగ్గురూ ఆలోచించుకొని, మీలో నొకరు మా కన్యను వివాహమాడుటకు సమ్మతించిన యెడల వివాహము చేయుదును" అని చెప్పినాడు.

ఆయన మాటలు విని, వారా కన్యపై గల మోహముచే ఒకరు చేసికొనుటకు మరొకరు అంగీకరించక తగవుపడి, దుర్భాషలాడుకొని, విశ్వావసుని వద్దకు వెళ్ళి "అయ్యా! మేము దూరదేశమునకు పోవుచున్నాము. అచ్చట మా తగవు తీర్చుకొని ఒక అంగీకారమునకు వత్తుము. మేము తిరిగి వచ్చునంతవరకు ఈ కన్య నెవరికీ వివాహము చేయవద్దు" అని కోరిరి. విశ్వావసుడు అందుకు అంగీకరించగా, వారు దూరదేశమునకు పోయిరి.

ఆ విధంగా వెళ్ళిన యువకులు చాలకాలం వరకు తిరిగి రాలేదు. ఈలోపుగా ఆ కన్య మరణించినది. తల్లిదండ్రులా కన్య శవమును శ్మశానమునకు తీసుకొనిపోయి దహన సంస్కారాలు గావించి యింటికి వచ్చిరి.

దూరదేశముననున్న ఆ బ్రాహ్మణ యువకులకెట్లో ఆమె మరణవార్త తెలిసినది. అంతట వారు ముగ్గురు ఆ గ్రామమునకు వచ్చి ఆమెను దహనము చేసిన స్థలమునకు పోయి మిక్కిలి దుఃఖించిరి. తరువాత వారిలో నొకడు ఆ

కన్య యొక్క బూడిదను తీసి శరీరమంతకు పూసికొని ఆ స్మశానములోనే కాచు కొని యుండెను. మరియొకడు ఆ కన్యయొక్క శల్యముల నెత్తుకొని కాశీ వెళ్ళెను.మూడవవాడు ఆమెయందు గల అధికమోహం వలన నేమియు తోచక పిచ్చివానివలె పరదేశములకు పోయి తిరుగుచుండెను. అతడట్లు తిరుగుచు ఒక నాడు ఒక బ్రాహ్మణుని యింటికి పోయి అన్నము పెట్టమని కోరెను.

ఆ బ్రాహ్మణుడు జాలిపడి భార్యను పిలిచి ఈ బ్రాహ్మణ యువకునకు అన్నము పెట్టుమని చెప్పితాను స్నానము చేయుటకు పోయెను. అప్పుడా బ్రాహ్మణస్త్రీ అన్నము వండుటకు కట్టెలు లేక, తన కొడుకును చంపి పొయ్యిలో పెట్టి మంటచేసి అన్నము వండెను. తరువాత ఆ పొయ్యిలోని బూడిదనంతను ఒకచోట చేర్చి, దానిపై నుదకమును చల్లి ఒక పుస్తకముతో కొట్టెను. అప్పుడా బూడిదనుండి ఆమె కుమారుడు వెలికివచ్చెను. అది యా బ్రాహ్మణ యువకుడు చూచి ఆశ్చర్యపడి, ఈ యుపాయముతో విశ్వావసుని కుమార్తెను బ్రతికించవచ్చు నని తలచి, భోజనముచేసి అచ్చట కొంతసేపు పయనించినట్లు నటించి, ఆ పుస్తకమును సంగ్రహించి ఆ బ్రాహ్మణ కన్యను దహనముచేసిన స్థలమునకు వెళ్ళెను.

అదే సమయమునకు గంగాస్నానమునకు కాశికేగిన బ్రాహ్మణ యువకుడుకూడ అచ్చటికి వచ్చెను. మరియొకడు ఆ కన్యయొక్క బూడిదను శరీరమునకు పూసికొని అచ్చటనే కనిపెట్టుకొని యుండెను. పుస్తకమును తెచ్చిన యువకుడు బూడిదనంతను ఒకచోట చేర్చి దానిపై నుదకముచల్లి ఆపుస్తకముతో కొట్టెను. వెంటనే ఆ కన్య బ్రతికెను. అంత నా ముగ్గురు యువకులు పరమానందము పొంది, నేను వివాహమాడుదునంటే, నేను వివాహమాడుదునని తగవు పడసాగిరి.

బూడిదనుండి పుట్టిన కన్యకై తగవు పడుచున్న బ్రాహ్మణ యువకులు

కాబట్టి ఆ ముగ్గురిలో ఆ కన్య యెవరికి భార్యయగుట న్యాయము?" అని భేతాళుడు అడుగగా, విక్రమాదిత్యుడు "ఆ కన్యయొక్క శల్యములను తీసుకొని గంగానదికి పోయినవాడు పుత్రుడనదగును బ్రతికించినవాడు తండ్రివంటివాడు. శ్మశానమునందుండి ఆమెను దహనముచేసిన స్థలమున బూడిదను కాచుకొనియున్నవాడు ఆమెకు భర్త కాదగును" అని చెప్పగా, భేతాళుడు సంతోషించి, వీపుపైనుండి మాయమై చెట్టు పైకిపోయి ఎప్పటివలెనుండెను.

భేతాళుడు చెప్పిన - రెండు చిలుకల కథ

విక్రమాదిత్యుడు తిరిగి ఆ వటవృక్షముపైకి పోయి భేతాళుని పట్టి, బంధించి, తీసుకొని వచ్చుచుండగా మరల నొకకథ చెప్పసాగెను.

పూర్వము ఉమావతియను పట్టణము వుండెను. దానిని కేసరియను రాజు పాలించుచుండెను. అతనవద్ద భూత భవిష్య ద్వర్తమానములను తెలుపగల ఒక చిలుక ఉండెను. ఒకనాడు ఆ రాజు చిలుకను చూచి" నీవు మూడు లోకములలో జరుగు విశేషములను చెప్పగలవుకదా! నాకు భార్యగా రాబోవు స్త్రీ ఎచ్చటనున్నదో చెప్పు"మని అడిగెను.

రాజు మాటలువిని ఆ చిలుక "రాజా! మగధదేశమున చంద్రలోచనుడను రాజు కలడు. అతనికి చంద్రమతియను కుమార్తె ఉండెను. ఆ కన్యయొక చిలుకను పెంచుచున్నది. అదికూడ భూత భవిష్య ద్వర్తమానములు తెలుపగలదు. ఆ చిలుక నీవు చంద్రమతికి భర్తవగుదు వని చెప్పినది. కావున నీకు ఆ స్త్రీ భార్య కాగల"దని చెప్పెను.

ఆ శుకరాజము చెప్పిన మాటలువిని రాజు సంతోషించి మగధదేశమునకు పురోహితులను పంపి, చంద్రమతిని తనకిచ్చి వివాహము జరిపించుడని కోరగా, చంద్రలోచనుడు అందుకు అంగీకరించి, తన కుమార్తెను కేసరికి యిచ్చి వివాహము జరిపించెను, తరువాత ఆ రాత్రి రాజకుమారుని, రాజపుత్రిని శయ్యాగృహమునకు పంపిరి.



రాజు రాణి మంచముపై శయనించి యుండగా రెండు చిలుకలు తగవుపడుట

అప్పుడారాజు తన మగచిలుకను, తన భార్యయొక్క ఆడు చిలుకను ఒక పంజరము నందుంచెను. అంతట మగచిలుక మిక్కిలి సంతోషముతో ఆడు చిలుకను కూడి క్రీడించ నారంభించగా, ఆడుచిలుక దానిని దగ్గరకు రానియ్యక 'మగవారిని నమ్మకూడ"దని చెప్పెను. అది విని మగచిలుక కోపించి "స్త్రీలనునమ్మరా" దని చెప్పెను.

మగచిలుక మాటలకు ఆడుచిలుక ఆడుచిలుక మాటలకు మగచిలుకకోపించి తగవుపడి రాజు సన్నిధికేగి తమ వివాదము తెలిపినవి. అప్పుడు ఆడుచిలుక తన మాటను సమర్థించుకొనుటకు ఈ కథ చెప్పినది.

మధురాపురమను పట్టణము కలదు. అందు ధర్మదత్తుడను ఒక వర్తకుడు ఉండెను. అతనికి దత్తుడను పుత్రుడు కలిగెను. అతడు చిన్నతనములోనే తల్లిదండ్రులను పోగొట్టుకొనెను. వాడు చెడు స్నేహములుచేసి, వారకాంతలతో విహరించుచు, తల్లిదండ్రులు సంపాదించిన ధనమంతయు వ్యయముచేసి,దరిద్రుడై దేశద్రిమ్మరియై తిరుగుచు చండనావతియను పట్టణమునుచేరి హిరణ్యకుడు అనే ఒక వర్తకుని కలిసి అతనితో తన వృత్తాంతమంతయు చెప్పి, తాను చేయగల వర్తకముల గూర్చి తెలుపగా, ఆ వర్తకుడు అతని శక్తి సామర్థ్యములకు సంతోషించి, తనకు సహాయముగా ఉండదగిన వ్యక్తి అని భావించి, తన పుత్రికనిచ్చి పెండ్లిచేసి తన యింటనుంచుకొనెను.

దత్తుడు కొంతకాలం మామగారియింట నమ్మకముగా ఉండి వ్యాపారం చేసి చాల మెప్పుపొందెను. పిమ్మట నొకనాడు మామగారితో "నేను చాలదినముల క్రిందట స్వస్థలమును విడిచిపెట్టితిని. నా బంధుమిత్రులను చూచి త్వరలో తిరిగి వచ్చెదను. నాభార్యను వారందరికి చూపించి, నాలుగు దినములుండి వచ్చెద"ననగా హిరణ్యకుడు సంతోషించి, తన కుమార్తెకుగల వెలగల నగలనన్నిటినిపెట్టి అతనితో పంపెను. అల్లునికి కూడ వెలగల వస్త్రభూషణములొసగెను.

దత్తుడు భార్యతోకలసి కొంతదూరము పోయిన తరువాత భార్యను చూచి "ఓసీ మనము పోవుదారిలో దొంగలధికంగా నివసించుచున్నారు. కనుక నీ

ఆభరణములనన్నిటిని తీసి యిమ్ము. మూటగట్టి నావద్ద జాగ్రత్తపెట్టుదును" అని నమ్మబలికి. ఆమెవద్దనున్న నగలనన్నిటిని పుచ్చుకొని, ఆమెనొక పాడుబావిలో పడవేసి తనపాత స్నేహితులైన వేశ్యలకు ఆ నగలనుయిచ్చి వారితోకలసి దుర్మార్గమున సంచరించసాగెను.

అతడట్లుండ, బావిలో త్రోయబడిన హిరణ్యకుని కుమార్తె బిగ్గరగా ఏడ్చుచుండగా, కొందరు బాటసారులు ఆమె యేడ్పువిని బావినుండి పైకితీసి ఆమె వృత్తాంతమంతయు తెలిసికొని, తండ్రియింటికి పంపిరి.

ఆ యువతి పుట్టింటికి పోగానే తల్లిదండ్రులు నీ భర్త ఏమైనాడని అడుగగా, మేము అడవి మార్గమున పోవుచుండగా దొంగలువచ్చి మా వద్దనున్న నగలనన్నిటిని దోచుకొనడమేగాక, నా భర్తనుకూడ పట్టుకొనిపోయినారని చెప్పినది, ఏనాటికైనా తనభర్త తనవద్దకు రాగలడను నమ్మకముతో, తల్లిదండ్రులకు అతనిపై కోపము కలుగకుండ చేయుటకు అట్లు చెప్పినది.

అప్పుడు ఆ యువతి తల్లిదండ్రులు, బంధువులు ఆమెకు ధైర్యము చెప్పి విచారమును పోగొట్టిరి. దత్తుడు మాత్రము భార్యనుండి దోచుకొన్న నగలు మొదలగువాటి నన్నిటిని వేశ్యలపాలు చేసి, దరిద్రుడై మామగారియింటికి పోయి మాయమాటలు చెప్పి మరికొంత ధనము సంపాదించుకొని రావలెనని నిశ్చయించుకొని అత్తవారియింటికి పోయెను. మామగారితోనతడు తన భార్య వ్యాధిగ్రస్తురాలై చనిపోయినదని చెప్పవలెననుకొనెను.

అట్టి దుర్బుద్ధితో అత్తవారింటికిపోయిన దత్తునకచట గుమ్మములోనే అతని భార్య కనబడినది. ఆమెనుచూచి అతడు పారిపోవుటకు సిద్ధపడుచుండగా

ఆమె మగని వెంటపడి ఆపి, "మీరు భయపడిపారిపోవలసిన పనిలేదు. నేను మా తల్లిదండ్రులతో దొంగలు నానగలను దోచుకొన్నారనీ, మిమ్ము కూడ తీసుకొని పోయినారని చెప్పితిని. కావున వారు మిమ్ముచూచి సంతోషముగా ఆదరింతురుగాని అన్యథాచేయరని" చెప్పి యింటికి తీసుకొనిపెళ్ళెను. తిరిగి వచ్చిన అల్లుని చూచి అత్తమామలు ఎంతో ఆనందించి, పూర్వమువలెనే చూచుచుండిరి.

ఉన్నట్లుండి వర్తుడు ఒకనాటి రాత్రి గాఢనిద్రలోనున్న భార్య గొంతు కోసి, ఆమె వద్దనున్న ఆభరణములను అన్నిటిని తీసుకొని పారిపోయి పూర్వము వలెనే వేశ్యల యిండ్లకు పోయి కాలము గడుపసాగెను. తమ కూతురు దుర్మరణము పొందినందుకు తలిదండ్రులు త్తరని దుఃఖము పొందిరి. కావున మగవారి నెన్నటికినీ నమ్మరా"దని ఆడుచిలుక చెప్పెను.

ఆడుచిలుక చెప్పిన కథవిని మగచిలుక రాజును చూచి "మహారాజా! నేనొక కథ చెప్పుచున్నాను, వినుడు" అని ఈ క్రింది కథ చెప్పెను.

రక్షితయను పేరుగల పట్టణము కలదు. దానిని ధర్మదత్తుడను రాజు పాలించుచుండెను. ఆ యూరిలో ధనగుప్తుడను వర్తకునకు వసుమతి యను కూతురు ఉండెను. ధనగుప్తుడు తన పుత్రికను సముద్రగుప్తుడు అనువానికి యిచ్చి పెండ్లి చేసెను. వసుమతి, సముద్రగుప్తులు సుఖముగా కాపురము చేయుచుండిరి. ఇట్లుండ సముద్రగుప్తుడు విశేషధనమార్జించు తలంపుతో విదేశములకు పోయెను.

భర్త విదేశములకు పోయిన తరువాత వసుమతి ఒక బ్రాహ్మణుని ప్రేమించి, అతనితో రహస్యముగ కాలము గడుపసాగెను. ఇట్లు కొన్నాళ్ళు

జరిగిన తరువాత సముద్రగుప్తుడు విదేశములనుండి తిరిగి వచ్చెను. అతడు తన భార్యపైనెట్టి అనుమానము పెట్టుకొనక పూర్వమువలె ఎంతో యిష్టముగా చూచు చుండెను. ఆమెకు వెలగల నగలు, బట్టలు మొదలగునవి తెచ్చి యిచ్చెను.

భర్త ఎంతో ప్రేమగా చూచుచున్నను వసుమతి తన ప్రియుడగు బ్రాహ్మణుని యందుగల మోహమును విడువలేక, ఒక చెలికత్తెను పంపించి, అతనిని కలియుట కొరకు సంకేతస్థలమును తెలియజేయించి అచ్చట కలిసికొనుటకు ఉపాయము తెలిపెను.

ఆమె కబురుచేసిన ప్రకారము ఆ బ్రాహ్మణుడు అర్ధరాత్రి సమయమున బయలుదేరి వచ్చుచుండగా రాజభటులు చూచి దొంగ అని భావించి బాణము విడువగా నది వానికి గాఢముగా నాటెను. అంత నాతడు కెవ్వుమని అరచి క్రిందపడి గిలగిల కొట్టుకొనుచున్న సమయమున వసుమతి అచ్చటికి వచ్చెను. ఆ సమయమున నా బ్రాహ్మణుడు మరణావస్థలో నుండెను. వసుమతి అతడు నిద్రించుచున్నట్లు నటించుచున్నాడని తలచి, ప్రేమాతిశయముతో నతని దగ్గరకు పోయి, గాఢాలింగనము చేసికొని ముద్దుపెట్టుకొనునప్పుడు ఆమె ముక్కు బ్రాహ్మణుని నోటిలో నిరుకుకొనెను. అదే సమయమున వాని ప్రాణము పోయినందున వాని నోరు మూసికొనిపోయినది. వసుమతి ముక్కు అతని నోటిలో బిగిసిపోయి నందున తెగిపోయినది.

అప్పుడా యువతి తన ప్రియుడు చనిపోయినాడని గ్రహించి, ముక్కు వద్ద బట్ట అడ్డుపెట్టుకొని వేగముగా యింటికిపోయి, గోడుగోడున ఏడ్చుచు నా భర్త నా ముక్కు కోసినాడని అందరిని పిలువనారంభించినది. ఇంటిలో నిద్రపోవు

చున్న ఆమె భర్త ఏడ్పులు బొబ్బలువిని లేచి, నా భార్య యిట్లు అబద్ధమాడు చున్నదేమిటా అని ఆశ్చర్యపడుచుండెను. ఇరుగు పొరుగువారువచ్చి ఆమెభర్తను నిందింపసాగిరి. వసుమతి దొంగ ఏడ్పులను, మాటలను నమ్మి ఇరుగు పొరుగు వారు ఆమె భర్తను రాజువద్దకు తీసుకొనిపోయి, అతడు తన భార్య ముక్కును కోసినాడని ఫిర్యాదు చేసిరి. రాజు వారి మాటలు నమ్మి అతనికి కఠిన శిక్ష విధించెను.

ఇంతలో రాత్రి పట్టణములో కావలియున్న రాజభటులు వచ్చి రాజుకు జరిగిన వృత్తాంతమంతయు చెప్పి, ఆ బ్రాహ్మణుని మృతదేహమును తెప్పించి రాజు ముందుంచిరి. రాజు ఆ బ్రాహ్మణుని నోరు తెరపించి అందున్న వసుమతి ముక్కును వెలికి తీయించి అందరి యెదుట పెట్టించెను. వసుమతి చేసిన చెడుపనికి రాజు ఆగ్రహించి, ఊరినుంచి వెళ్ళగొట్టించెను. కావున స్త్రీలను నమ్మరాదు". అని మగచిలుక చెప్పెను.

రెండు చిలుకలు చెప్పిన కథలను రాజు శ్రద్ధగా విని ఏమి చెప్పుటకును తోచక యూరకుండెను. కనుక ఓ విక్రమాదిత్య మహారాజా! ఆ రెండు చిలుకలలో నేది అపజయము పొందు"నని భేతాళుడు ప్రశ్నించగా, "పురుషులలో నెవడైన ఒకడు దుర్మార్గము చేయునుగాని అందరూ చేయరు. స్త్రీలు అతిపాపిష్ఠులు కనుక పాపమునకు భయపడరు. అందువలన ఆడుచిలుక ఓడిన"దని విక్రమాదిత్యుడు చెప్పగా, భేతాళుడు విని ఆనందించి మరల చెట్టుపైకి పోయి నిలిచెను.

భేతాళుడు చెప్పిన-వీరవరుని కథ

అంతట విక్రమాదిత్యుడు మరల చెట్టుపైకెక్కి భేతాళుని పట్టుకొని బంధించి తెచ్చుచుండగా, అతడు మరియొక కథ నిట్లు చెప్పసాగెను.

పూర్వము సోమావతియను పట్టణము ఉండెను. దానిని సూత్రమతి యను రాజు పాలించుచుండెను. అతడు సోమప్రభయను కన్యను వివాహమాడి సుఖముగా కాలము గడుపుచుండెను.

ఇట్లుండగా ఒకనాడొక బ్రాహ్మణుడు ఆ రాజు వద్దకు కుటుంబ సహితముగా వచ్చి తనకు కొలువు యిప్పించమని కోరెను. రాజు ఆ బ్రాహ్మణుని కోరిక విని "నీవు ఎవరు? ఎక్కడినుండి వచ్చినావు? ఏమి పని చేయగలవు?" అని అడుగగా, నతడు "నేను మాళవదేశమునుండి వచ్చితిని. బ్రాహ్మణుడను. నాకు మాసమునకు అయిదువందల వరహాలు జీతము యిప్పించుడు. నేను కోరినట్లు నన్ను మీ కొలువులో ఉంచుకొన్న యెడల మీకు ఆపద కలిగినప్పుడు సహాయ పడుదును" అని చెప్పెను.

అందుకు రాజు సమ్మతించి, అతడు కోరినట్లు జీతమిచ్చుటకు ఒప్పుకొనెను. అతడు కుటుంబముతో నివసించుటకు ఒక మేడ కట్టించి యిచ్చి,ఎంతో గౌరవముగా చూచుచుండెను. ఇట్లు కొన్ని దినములు గడచిన పిమ్మట రాజు ఆ బ్రాహ్మణుడు ఎట్లు ప్రవర్తించుచున్నాడో తెలుసుకొని చెప్పుడని కొందరు గూఢ చారులను నియమించెను. వారు ఆ బ్రాహ్మణుని గూర్చి బాగుగా విచారించి రాజు వద్దకువచ్చి "మహారాజా! ఆ బ్రాహ్మణుడు మీరు యిచ్చుచున్న ధనములో ప్రతి

నెలా రెండువందల వరహాలు దేవాలయములకు, రెండువందల వరహాలు బ్రాహ్మణాగ్రహారములకు, వందవరహాలు తన కుటుంబ ఖర్చులకు వినియోగపరచుచున్నాడు" అని చెప్పిరి. వారు చెప్పిన మాటలు విని రాజు ఎంతో ఆనందించి, అతనిని ముందుకంటె మరింత గౌరవముగా చూడసాగినాడు.

ఆ బ్రాహ్మణుడు రాజువద్ద కొలువు సంపాదించినప్పటినుండి, ఎల్ల వేళల ఆయన వద్దనేవుండి కంటికి రెప్పవలె కాపాడుచుండెను. రాజువద్దనున్న సర్దారులలో నతడు వీరవరుడని బిరుదు పొందెను.

ఇట్లు జరుగుచుండగా ఒకనాడు అర్ధరాత్రి సమయమున ఎచ్చటి నుండియో యొక స్త్రీ రోదనము వినబడసాగినది. రాజు ఆ ఏడుపు విని అంతఃపురమునుండి బయలుదేరి వచ్చుచుండగా వీరవరు డాయనకు ఎదురుపడినాడు. రాజు అతనిని చూచి ఆ ఏడుపు ఎచ్చటనుండి వచ్చుచున్నదో విచారించి రావలసినదని ఆజ్ఞాపించెను. వీరవరుడు 'చిత్తమట్లే చేసివత్తు'నని రాజుకు చెప్పి వెళ్ళిపోయెను. రాజు అతడు వెళ్ళిన తరువాత ఏమి చేయునో పరిశీలింపవలెనని తలచి, రహస్యముగ అతని ననుసరించి పోయెను.

వీరవరుడు ఏడ్పుధ్వని వచ్చుచున్న దిక్కుగా పోయెను. అతడు పట్టణము చివరకు పోగా అచ్చట నొకస్త్రీ కనబడెను. ఆమె అచ్చట కూర్చుండి బిగ్గరగా ఏడ్చుచుండెను. వీరవరుడు ఆమెవద్దకుపోయి "ఇంత రాత్రివేళ ఇచ్చట కూర్చుండి ఏడ్చుచున్న నీ వెవరివి? ఎందుకు ఏడ్చుచున్నావు?" అని అడుగగా, ఆ స్త్రీ "ఓయీ! నేనీ పురదేవతను. ఈ పట్టణము నేలుచున్న రాజుకు ఒకగొప్ప ఆపద రాబోవుచున్నది. అతడు మిక్కిలి ధార్మికుడు కావున విచార మాపుకొనలేక ఏడ్చుచున్నా"నని చెప్పెను.

ఆమె మాటలు విని వీరవరుడు "తల్లీ! మా రాజుకు రానున్న ఆపద ఎట్లు తొలగునో దయయుంచి తెల్పు"మని వేడుకొనగా, ఆమె "ఒక బ్రాహ్మణ బాలుని ఇచ్చటికి తీసికొనివచ్చి బలి యిచ్చిన యెడల రాజుకు రానున్న కీడు తొలగిపోవు" నని చెప్పెను. ఆ మాటలు విని వీరవరుడు వెంటనే తన యింటికిపోయి, భార్యను పిలిచి పురదేవత చెప్పిన విషయము లన్నియు చెప్పి మన కుమారుని బలియిచ్చి రాజును కాపాడవలెనని తలచుచున్నాను. ఇందుకు నీవు యిష్టపడుదువా? అని యడుగగా, ఆ యిల్లాలు మీకు యిష్టమైన నాకును యిష్టమేయని చెప్పెను. తరువాత వారు తమ కుమారుని పిలిచి జరిగిన విషయములను తెల్పి నీ అభిప్రాయము తెల్పుమని యడుగగా, నా బాలుడు రాజును రక్షించుటకు నా ప్రాణమిచ్చుటకు సిద్ధముగా వున్నానని, మీరు తలపెట్టిన కార్యము చాల యోగ్యమయినదని చెప్పెను.

వీరవరుడంతట తన కుమారుని పురదేవతయగు కాళి గుడికి తీసుకొని వెళ్ళి, శుభ్రముగా స్నానము చేయించి, కాళి ముందు తల నరికి బలి యిచ్చెను. అదిచూచి ఆ బాలుని చెల్లెలు, తల్లి దుఃఖము భరించలేక మరణించిరి. భార్యయు, బిడ్డలు మరణించినందుకు వీరవరుడు చాల బాధపడి, నేను మాత్రము బ్రతికి లాభ మేమి? యని తలచి కాళిముందు నిలబడి "తల్లీ! నీవు చెప్పినట్లు చేసితిని. కావున ఈ పట్టణపు రాజును, ప్రజలను కాపాడు భారము నీదే!" యని, చేతనున్న ఖడ్గముతో తల నరకుకొని మరణించెను.

జరిగిన విషయము లన్నియు రాజు చూచి నా కొరకు ఇందరు ఏక కాలమున మరణించిరి. ఇట్టి ఉత్తములు పోయిన తరువాత బ్రతికి ఏమిలాభము అని తలచి ఖడ్గముతో తన శిరస్సును ఖండించుకొనబోవుచుండగా, మహాకాళి



వీరవరుడు దేవి ఎదుట కుమారుని చంపుట వెనుకనుండి రాజు చూచుట

అతని చేయి పట్టుకొని "రాజా! నీ ప్రాణము నిలుపుటకై యిందరు మరణించిరి. నీవు మరణించుటకు ప్రయత్నించుట న్యాయముకాదు. నీకు కావలసిన వరమేదైనా కోరుకొను మిచ్చెద"ననగా, రాజు ఆనందించి, "తల్లీ! నా క్షేమముకోరి మరణించిన ఈ నలుగురిని బ్రతికించుము. అంతకంటె నేను కోరదగిన వేమియు లేవని" చెప్పగా, మహాకాళి సంతోషించి ఆ నలుగురిని బ్రతికించెను.

రాజు వారికి తెలియకుండ తన కోటకుపోయి ఏమియు ఎరుగనట్లు ఉండెను. వీరవరుడు భార్యను, పిల్లలను యింటికిపంపి కాళీమాతకు నమస్కరించి రాజు వద్దకు పోయెను. రాజు వెళ్ళినపని ఏమైనదని అడుగగా, ఏడ్చుచున్న స్త్రీకి ధైర్యము చెప్పి, సంతోషము కలిగించి వచ్చితినని చెప్పెను.

వీరవరుని మాటలువిని రాజు మిక్కిలి ఆనందించి, రాత్రి జరిగిన విషయము లన్నియు ప్రజలకు చెప్పి, తన ప్రాణము కాపాడుటకు ప్రాణత్యాగము చేసిన వీరవరుని కుటుంబము ననేక విధముల కొనియాడి, అతని కనేక బహుమతుల నొసగి తనవద్ద మంత్రిపదవి నిచ్చి గౌరవించెను. కావున వారిలో నెవరు శ్రేష్ఠు"లని భేతాళుడు ప్రశ్నించెను.

అప్పుడు విక్రమాదిత్యుడు "యజమాని కొరకు నౌకరు ఎట్టి కార్యము నైన చేయుట ధర్మము. భర్త మాటప్రకారము చేయుట భార్యకు ధర్మము. తల్లిదండ్రుల యిష్టము ననుసరించి చేయుట పుత్రుని ధర్మము కాబట్టి వారు నలుగురు వారివారికి యోగ్యములైన కార్యములనే చేసిరి. అయితే వారి నిమిత్తము తన ప్రాణములను పోగొట్టుకొనుటకు సిద్ధపడిన రాజు మిక్కిలి న్యాయాధిపతి"యని చెప్పగానే, భేతాళుడు సంతోషించి, తిరిగి వృక్షము మీదికి పోయి ఉండెను.

భేతాళుడు చెప్పిన-స్త్రీ భోగి, భోజనసుఖి, నిద్రాసుఖి అను వారి కథ

వంగదేశమున భూషణుడను బ్రాహ్మణుడు ఉండెను. అతనికి ముగ్గురు కొడుకులు కలిగిరి. ఆ బ్రాహ్మణుడు ఒక యాగము చేయదలచి తన

పుత్రులను పిలిచి మీరు సముద్రమునకు వెళ్ళి యొక కూర్మమును తీసుకొనిరండని చెప్పి పంపెను.

ఆ ముగ్గురు సముద్రమునకు వెళ్ళి ఒక కూర్మమును చూచి తమ్ముని పిలిచి దానిని యెత్తుకొని రమ్మని చెప్పగా వాడు నేను భోజన సుఖిని కనుకయెత్త జాలనని తెలిపెను. రెండవవానిని యెత్తమనగా వాడు నేను స్త్రీ భోగిని కావున యెత్తడములేదని చెప్పెను. జ్యేష్ఠుడు నేను నిద్రాసుఖిని కనుక యెత్తనని పలికెను.

ఈ విధముగా వారు తగవుపడి, విజయనగరమనే పట్టణమునకుపోయి, ఆ పట్టణము నేలుచున్న ప్రతాపుడను రాజువద్ద తమ వ్యాజ్యమును చెప్పుకొనిరి.

అప్పుడు ఆ రాజు వారి సామర్ధ్యమును తెలుసుకొనవలెనని భావించి, ఒక స్త్రీని పిలిపించి, వెలగల వస్త్రభూషణములు ధరింపజేసి స్త్రీ భోగి వద్దకు పంప గానే వాడు ఆ స్త్రీని చూచి, ముక్కు మూసుకొని నీవద్ద దుర్వాసన కలదు వెంటనే వెళ్ళిపొమ్మని పంపివేసెను. ఆ సంగతి రాజు తెలుసుకొని, దాని తల్లిని పిలిపించి ఆ స్త్రీ పూర్వచరిత్ర తెలుపుమని యడుగగా "ఇది నా చెల్లెలి కూతురు. ఇది పుట్టిన అయిదు దినములకే నా చెల్లెలు మరణించినది. అప్పుడు దీనికి మేకపాలు పట్టించి పెంచితిని కావున దీని శరీరము దుర్వాసన కలిగియున్నది" అని చెప్పెను.

తరువాత రాజు మధురమైన పదార్థము వండించి భోజన సుఖిని పిలిపించి భోజనం చేయుమనగా, వాడు ఆ యన్నమును చూచి పీనుగుకంపు కొట్టు చున్నదని పలికి వదలిపెట్టెను. రాజు ఆ సంగతి విచారించగా, ఆ యన్నము శ్మశానము దగ్గరనున్న భూమిలో పండించిన వడ్లబియ్యముతో వండినందున అట్టి వాసన కలిగినదని గ్రహించెను.

పిమ్మట నా రాజు ఒక మృదువైన పరుపును తయారుచేయించి, నిద్ర సుఖిని పిలిపించి దానిపై పరుండుమని చెప్పగా, వాడా పరుపుపై పవ్వళించి వెంటనే పైకిలేచి పోయెను. అట్లేల చేసితివని రాజు అడుగగా ఆ పరుపులో నొకవెంట్రుక యుండి ఒత్తుకొనుటచే లేచిపోయితినని చెప్పెను. రాజు ఆ పరుపును విప్పించి చూడగా దానియందొక రోమముండెను.

రాజు వారు ముగ్గురు చెప్పిన విషయములు విని, వారికిగల సామర్థ్యమునకు సంతోషించి తగు బహుమతులు యిచ్చి గౌరవించెను. ఓ, విక్రమాదిత్య మహారాజా! ఆ ముగ్గురిలో ఎవరు అధిక సుకుమారులు?" అని భేతాళుడు ప్రశ్నించగా, విక్రమాదిత్యుడు "భోజనసుఖి, స్త్రీ సుఖి బుద్ధిచేత గ్రహించి చెప్పిరి. నిద్రాసుఖి పరుపులోనున్న వెంట్రుక వలన కలిగిన దద్దు వాని శరీరమున కాన వచ్చెను. కావున వాడే మిగుల సుకుమారి"యని చెప్పెను. అది విని భేతాళుడు సంతోషించి, మరల పారిపోయి వృక్షము నెక్కి యెప్పటివలె నుండెను.

భేతాళుడు చెప్పిన-జ్ఞాని, విజ్ఞాని, శూరులను వారి కథ

విక్రమాదిత్యుడు మరల చెట్టుపైకి పోయి భేతాళుని పట్టి బంధించి తీసుకొని వచ్చుచుండగా "మహారాజా! మరియొక కథ చెప్పుచున్నాను వినుము. ఉజ్జయినీ పురమునందు అగమస్వామియను బ్రాహ్మణుడు ఉండెను. అతనికి వేద పాలకుడను నొక కుమారుడును, సోమప్రభయను నొక కూతురును గలరు. సోమప్రభకు తండ్రి వివాహము చేయు తలంపుతో నున్న సమయమున జ్ఞాని, విజ్ఞాని, శూరుడు అను ముగ్గురు యువకులు వచ్చి ఆ కన్యనిమ్మని కోరిరి. తండ్రి ఆమెను

జ్ఞానికి యిచ్చుటకు అంగీకరించెను. కాని మిగిలిన యిద్దరు యువకులు అందుకు యిష్టపడక వివాదపడసాగిరి.

బ్రహ్మరాక్షసుని చంపి సోమప్రభను రక్షించిన శూరుడు

ఆ సమయమున నొక బ్రహ్మ రాక్షసుడు వచ్చి సోమప్రభ నెత్తుకొని పోయెను. అదిచూచి ఆమె తండ్రియు, సోదరుడు దుఃఖపడుచుండగా, జ్ఞాని యనువాడు ఆ రాక్షసుడు వెళ్ళిన మార్గమును, వాడు నివసించు స్థలమును చెప్పెను. విజ్ఞాని యనువాడు రథమును, విల్లు మొదలగువానిని సంపాదించెను. శూరుడు ఆ

రథమునెక్కి ధనుర్బాణములను తీసుకొని రాక్షసుని వెంటాడి, వానిని చంపి ఆ కన్యను రక్షించి, రథములో కూర్చుండబెట్టుకొని తెచ్చి తండ్రి కప్పగించెను. కనుక ఆ ముగ్గురిలో ఆ కన్యకు పురుషుడు కాదగినవాడెవ్వడు?" అని భేతాళుడు ప్రశ్నించగా, "శూరుడే ఆమెకు భర్తకాదగినవాడు కాని, మిగిలినవారు కార"ని విక్రమాదిత్యుడు చెప్పెను. అదివిని బేతాళుడు సంతోషించి, మరల పారిపోయి చెట్టుపై నిలచెను.

భేతాళుడు చెప్పిన - శిరమును బట్టి భర్తను నిర్ణయించిన కథ

విక్రమాదిత్యుడు మరల చెట్టుమీదికిపోయి బేతాళుని పట్టి బంధించి తీసుకొని వచ్చుచుండగా, నతడు క్రింది కథ చెప్పెను-పూర్వము హేలావతియను పట్టణమును చంద్రుడను రాజు పాలించుచుండెను. అతనికి రూపవంతుడను నొక పుత్రుడు పుట్టినందుకు ఆనందించి, తన గ్రామదేవతకు గోపురప్రాకార మండపంబులు కట్టించి, మిక్కిలి వైభవముగా ఉత్సవము చేయించెను.

ఆయుత్సవము చూచుటకు దూరగ్రామముల నుండి కూడ వేలాది ప్రజలు వచ్చిరి. ఆ విధముగా వచ్చిన ఒక చాకలివాడు తన కులమునకు చెందిన ఒక పడుచునుచూచి మోహించి, గుడిలోనికిపోయి "ఆకన్య నాకు భార్యయగునట్లు చేసినయెడల నీకు నాతలను బలియిచ్చెద"నని దేవతను ప్రార్థించెను. తరువాత ఆ కన్యయొక్క తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి తనకోరిక తెలుపగా, వారు ఆతనికి తమ కుమార్తెనిచ్చి వివాహము చేసిరి.

తరువాత ఆ చాకలివాడు తనభార్యను తీసుకొని సొంత గ్రామమునకు పోయి సుఖముగా ఉండెను. కొన్నిదినములు గడచిన తరువాత ఆ కన్యయొక్క తల్లిదండ్రులు తమ అల్లుని, కూతురును చూడదలచి, వారిని తీసుకొనిరమ్మని తమ కొడుకును పంపిరి. అతడు ఆగ్రామమునకుపోయి తన చెల్లెలిని, బావమరిదిని పిలుచుకొని వచ్చుచుండగా, దారిలోనున్న గ్రామదేవత గుడి కనబడినది. ఆ గుడిని చూచిన చాకలివానికి తనమ్రొక్కు సంగతి జ్ఞాపకమునకు వచ్చెను. అంతటవాడు గుడిలోనికిపోయి దేవతముందు నిలబడి తనచేతియందున్న ఖడ్గముతో శిరస్సును ఖండించుకొనెను. అదిచూచి వానిబావ దుఃఖము భరించలేక ఆ ఖడ్గముతోనే తన తలను కూడ ఖండించుకొనెను. వారిద్దరు అట్లు మరణించుట చూచి ఆ చాకలి యువతి దుఃఖము పట్టలేక నేనుమాత్రము బ్రతికి లాభమేమిటి అనితలచి, అచ్చట ఉన్న కత్తితో తనతలను ఖండించుకొన బోవుచుండగా, దేవత ఆమెకు ప్రత్యక్షమై "నీవు మరణించుటకు ప్రయత్నించవద్దు. నీభర్తకును, నీ సోదరునకు ప్రాణము నిచ్చెదను. వారి శిరస్సులను వారి మొండెములకు అతికించు"మని చెప్పగా, ఆ యువతి సంతోషము పట్టలేక తొందరపడి భర్తశిరస్సును అన్న మొండెమునకు, అన్నశిరస్సును భర్త మొండెమునకు తగిలించగానే ఎప్పటివలె వారు బ్రతికి పైకి లేచిరి. తరువాత ఆయువతి తానుచేసిన పొరపాటును గ్రహించి, వారిలో ఎవరిని తనభర్తగా ఎంచుకొనవలెనని ఆలోచనలో మునిగిపోయినది. కావున ఓ రాజ శేఖరా! ఆయిద్దరిలో నెవరినామె భర్తగా స్వీకరించదగు"నని యడిగెను.

అది విని విక్రమాదిత్యుడు "శరీరమునకంతకు శిరస్సు ప్రధానమైనది కావున మగని శిరస్సుగల శరీరముగలవాడే ఆమెకు భర్తయగు"నని చెప్పెను.

అదే న్యాయమైన నిర్ణయమని భేతాళుడు ఒప్పుకొని, మిక్కిలిసంతోషించి యెప్పటి వలె వృక్షముమీదికి పోయెను.

బేతాళుడు చెప్పిన - కార్పాటకుని కథ

విక్రమాదిత్యుడు వెంటనే చెట్టుమీదికి పోయి భేతాళునిపట్టి బంధించి తెచ్చుచుండగా అతడు మరియొక కథనిట్లు చెప్పెను—

మల్లికాపురమను పట్టణమును శకటశృంగుడను రాజు పాలించుచుండెను. అతనికి కార్పాటకుడను మిత్రుడు వుండెను. అతడు ఎల్ల వేళల రాజును కనిపెట్టుకొని తిరుగుచుండెను. ఒకనాడు రాజు తగుపరివారమును వెంటబెట్టుకొని వేటకుపోయెను. రాజువెంట కార్పాటకుడు కూడ వెళ్ళెను.

రాజు తనపరివారముతో అడవియందు ప్రవేశించి అనేక జంతువులను చంపి చాల అలసిపోయెను. దాహబాధ కలిగి చాల శ్రమపడసాగెను. అప్పుడు కార్పాటకుడు రెండు ఉసిరికపండ్లను తెచ్చి రాజుకు యిచ్చెను. రాజు ఆ పండ్లను తిని తనదప్పిక తీర్చుకొనెను. పిమ్మట తన పట్టణమునకు క్షేమముగా పోయెను.

తరువాత ఒకనాడు ఆరాజు కార్పాటకునితో మాట్లాడుచు, తనకు కళింగదేశపు రాజు కూతురును వివాహమాడవలెనను కోర్కెకలదని, నీవు వెళ్ళి ఆ కన్యను తనకిచ్చి వివాహము జరిపించునట్లు ఆ రాజును ఒప్పించి రమ్మని అడిగెను.

అంతట కార్పాటకుడు ఒక వర్తకుని యోడలోనెక్కి సముద్ర మార్గమున కళింగదేశమునకు పోవుచుండగా, నాయోడ తుఫాను ప్రమాదమునకు గురియై

.కగుట్టకు తగిలి బ్రద్దలై పోయెను. ఓడలోనున్న వారందరు నీటిలోమునిగి మర ించిరి. కాని కార్పాటకుడు మాత్రము నీటిలో మొలిచియున్న ఒక తీగను పట్టు "ని క్రిందికిపోగా కొంతదూరమున నాగలోకము కనబడినది. అతడచ్చటి కాంచన ↑రమను పట్టణము చేరెను.

అతడు ఆ పట్టణములో తిరుగుచు దుర్గాలయమును చూచెను. అతడు ↑ యాలయములోనికిపోయి దుర్గాదేవి ననేకవిధముల స్తుతించి, నమస్కరించెను. ↑ప్పుడు ఆయాలయములోనికి అనేకమంది పురస్త్రీలువచ్చి దేవికి పూజానమస్కా ారాదిక్రియలు జరిపించి పోవుచుండిరి. వారిలోనొక సుందరాంగి నూరుమంది దాసీ ↑తో ఆ యాలయమునకువచ్చి దుర్గను పూజించి కొంతసేపు నృత్యగానములుసలిపి పూజానమస్కారములు ఎంతో వైభవముగా జరుపుచుండెను.

ఆ సుందరాంగిని కార్పాటకుడు చూచి మోహించి, యొకదాసిని పరి ↑యము గావించుకొని, తన యభిప్రాయను తెలిపెను. ఆదాసి కార్పాటకుని యభి ప్రాయమును తన యజమానురాలికి తెలిపినంతట ఆమెయతనిని మోసగించదలచి ↑సి చెవిలోనేమో రహస్యముగా చెప్పెను.

అంతనాదాసి కార్పాటకుని చెంతకువెళ్ళి "ఓ సుందరుడా! నీ యిష్ట ప్రకారము జరిపించెదను. ఈలోపుగా చెరువులో స్నానముచేసి రమ్ము" అని చెప్పెను. దాసి మాటలువిని కార్పాటకుడు ఎంతో ఆనందించి, వెంటనే ఆ చెరు వులో మునిగి స్నానముచేయుటకు సిద్ధపడెను. అతడు ఆ చెరువులో మునిగి పైకి లేచుసరికి తన స్వస్థలమగు మల్లికాపురమునగల చెరువులో నుండి బయటికి వచ్చెను. ఆ విషయము గ్రహించి అతడు ఎంతో ఆశ్చర్యమును, విచారమును

పొందెను. తరువాత రాజువద్దకుపోయి జరిగిన సంగతులన్నియు చెప్పెను. అతడు చెప్పిన సంగతులు రాజువిని మిక్కిలి ఆశ్చర్యపడి "నీవుమోహించిన ఆ స్త్రీని నేను చూడగోరుచున్నాను. నాకు ఆ ప్రాంతమును చూపుము" అని, రాజ్యపాలనను మంత్రికి అప్పగించి కార్పాటకునితో కలిసి ఓడపై బయలుదేరెను. కార్పాటకుడు రాజును తీగయున్న ప్రాంతమునకు వెళ్ళిన తరువాత ఓడనుండి దింపి, తీగను రాజుకు చూపించి దానిని పట్టుకొని నాగలోకమునగల దుర్గాలయమునకు పోయిరి. వారు గుడిలోనికిపోయి దేవిని స్తుతించి, పూజించి నమస్కరించుచున్న సమయమున ఆ సుందరాంగి తనదాసీలతో అచ్చటికి వచ్చెను. ఆమెనుచూచి ఇంత అందమైన స్త్రీని నేను ఎచ్చటను చూడలేదని కార్పాటకునితో చెప్పెను. ఆ రాజకుమారి రాజుయొక్క అందచందములు చూచి ముగ్ధురాలై అతనిని వివాహమాడదలచెను. రాజువద్దకు పోయి "ఓరాజా! నేనీ పట్టణమేలు రాజుకుమార్తెను. నా తండ్రి అభీష్టప్రదమను నొకగ్రామమున్ను, నిర్మాణకరమను నొకగ్రామమున్ను నాకు యిచ్చియున్నాడు. నేనాగ్రామములు నీకొసగెదను. నిన్ను నేను ప్రేమించుచున్నాను. కావున నన్ను వివాహమాడుము" అని కోరెను. అదివిని రాజు కార్పాటకుని చూపించి "ఇతడు నా ప్రియమిత్రుడు. నాకంటె అందమైనవాడు, సత్యము తప్పనివాడు కావున యితనిని వివాహమాడి సుఖింపు"మని చెప్పెను.

రాజు మాటలకు నాగకన్య అంగీకరించగా, రాజు ఆమె హస్తమును కార్పాటకుని చేతియందుంచి, అతనికి అప్పగించి, "నీవునాకు లోగడ యిచ్చిన ఉసిరికపండ్లలో నొకదానిఋణము తీరినది. మరియొక పండుయొక్క ఋణము తీరవలసియున్న"దని పలికి, తన పట్టణమునకు పోయెను. కనుక వారిద్దరిలో

రాజు కార్పాటకుని చేయిని నాగకన్య చేయితో కలపుట

నెవరుచేసిన ఉపకారము గొప్పది" అని భేతాళుడు ప్రశ్నించగా, "సేవకుడు రాజాజ్ఞ ననుసరించి చేయడము ధర్మమే కనుక కార్పాటకుడు చేసిన ఉపకారము అంత గొప్పది కాదు, రాజుచేసిన ఉపకారమే గొప్ప"దని విక్రమాదిత్యుడు చెప్పెను. అది విని భేతాళుడు ఆనందించి తిరిగిపారిపోయి చెట్టుమీద నిలచెను.

భేతాళుని ప్రశ్న విని వరుని నిర్ణయించిన విక్రమాదిత్యుడు

విక్రమాదిత్యుడు వెంటనే చెట్టుపైకి పోయి భేతాళుని పట్టుకొని తెచ్చుచుండగా భేతాళుడు ఈక్రింది కథ చెప్పెను——

సింహపురమను పట్టణమును వీరదేవుడనురాజు పాలించుచుండెను. అతనికి పద్మావతియను భార్యకలదు. ఆ రాజుకు చాలా కాలము వరకు సంతానము కలుగలేదు. అందుచేనతడు విచారగ్రస్తుడై యొక జ్యోతిష్కుని పిలిపించి తనకు సంతానప్రాప్తి కలదో లేదో తెలుపగోరెను. అది విని ఆ జ్యోతిష్కుడు రాజునొక యాగమున్నూ, తపమున్ను చేసిన సంతానము కలుగునని చెప్పెను.

అప్పుడా రాజు తన మంత్రికి రాజ్యపాలనా భారము అప్పగించి, జ్యోతిష్కుడు చెప్పిన ప్రకారము యాగము చేసెను. పిమ్మట అడవికి పోయి భక్తి శ్రద్ధలతో ఈశ్వరుని గూర్చి తపస్సు చేయనారంభించెను. కొంతకాలమైన తరువాత ఈశ్వరుడు ఆ రాజుకు ప్రత్యక్షమై "ఓ రాజా! నీ తపస్సుకు మెచ్చితిని నీకు త్వరలో సంతానప్రాప్తి కలుగగలదు. ఇక నీ పట్టణమునకు పొమ్ము" అని పలికి అదృశ్యమైనాడు. ఈశ్వరుని మాటలు విని రాజు పరమానంద మంది, తన రాజ్యమునకు పోయెను. జరిగిన సంగతులు భార్యకు చెప్పగా నామె ఎంతో ఆనందించి, ముందు కంటె ఎక్కువ భక్తి శ్రద్ధలతో ఈశ్వరుని పూజించుచుండెను.

కొన్ని దినములకు ఆ రాజునకు ఒక కుమారుడును, ఒక కుమార్తెయు కలిగిరి. వారు బాలచంద్రులవలె ప్రకాశించుచుండిరి. రాజు తన కుమారునకు సూర్యదేవుడని, కుమార్తెకు రత్నావతియని నామకరణములు గావించి మిగుల గారాబముతో పెంచుచుండెను.

రత్నావతి క్రమముగ పెరిగి పెద్దదయ్యెను. ఆమె సకల కళలలో మంచి నేర్పుకలిగి తల్లిదండ్రుల మెప్పు పొందుచుండెను. రాజు ఆమెకు తగిన వరుని చూచి వివాహము చేయదలచుచుండగా నొక రాజ కుమారుడు వచ్చి ఆమెను తనకిచ్చి వివాహము చేయుడని రాజు నడిగెను. రాజు అతనిని చూచి నా కుమార్తెను గొప్ప ధైర్య సాహసములు, విద్య గలవానికి మాత్రమే యివ్వ దలచితినిగాని అన్యునకివ్వజాలనని తెలుపగా, నా రాజకుమారుడు నిరాశపడి తిరిగి వెళ్ళిపోయెను.

తర్వాత రాజు ఎంతకాలము నిరీక్షించినను, ఆతడనుకొన్న గుణము లన్నియు గల వరుడు లభించలేదు. అంతట రాజు తన కుమార్తెకు తగిన వరుడు లభించునో, లభించడో యని దిగులు పెట్టుకొని యుండగా, ఒకనాడు బ్రాహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులకు చెందిన నలుగురు అందమైన యువకులు వచ్చి రత్నావతిని తమకిచ్చి వివాహము చేయమని రాజును కోరిరి. రాజు ఏమి చేయుటకు తోచక మంత్రులను, పురోహితులను పిలిపించి, వీరిలో నెవనికి నా కుమార్తె నివ్వదగునో చెప్పుడని కోరగా, వారు ఏమియు చెప్పలేక మౌనముగా ఉండి పోయిరి. కాబట్టి ఆ చిన్న దానిని యెవరికియ్యవచ్చునో తెల్పుము" అని భేతాళుడు అడుగగా, "ఏ స్త్రీ నైనను అన్యకులస్థున కిచ్చుట అక్రమము. కనుక స్వకులస్థ

తయిన రాజకుమారునకు యిచ్చి వివాహము చేయుట యుక్తము" అని విక్రమాదిత్యుడు చెప్పెను. ఆ జవాబు విని భేతాళుడు ఆనందించి, తిరిగి చెట్టుపైకి పారిపోయెను.

భేతాళుడు చెప్పిన - మదనసేన కథ

తిరిగి విక్రమాదిత్యుడు చెట్టుపైకిపోయి భేతాళుని బంధించి తీసుకొని వచ్చుచుండగా, మరియొక కథ చెప్పెను-

పూర్వము వీరదేవుడను రాజు మహాదేశమును పాలించెను. ఆ రాజుకు ధనదుడు అను కుమారుడును, మదన సేనయను కుమార్తెయు ఉండిరి. రాజు తన కుమార్తెయగు మదనసేనను సువర్ణుడు అను యువకునకిచ్చి వివాహం చేయుటకు వాగ్దానము చేసెను.

ఇట్లుండ సువర్ణుని ప్రాణస్నేహితుడగు ధర్మదత్తుడనువాడు మదనసేనను చాలకాలమునుండి ప్రేమించుచుండెను. అతడు మదనసేనను సువర్ణునకిచ్చుటకు రాజు వాగ్దానము చేసిన విషయము తెలిసికొని బెంగ పెట్టుకొని మంచము పట్టెను. అతని స్థితి చూచి సువర్ణుడు జాలిపడి "చెలికాడా! నీ విట్లుండుటకు కారణమేమిటి? నీకు కలిగిన వ్యాధి ఏది?" అని అడుగగా, మదనదత్తుడు తన విచారమునకు కారణము చెప్పుటకు సిగ్గుపడి, యుక్తిగా తన స్థితి నెరిగించెను. అతని యభిప్రాయము తెలిసికొని సువర్ణుడు యింటికి పోయెను. ధర్మదత్తుడు మోహమణచుకోలేక మరునాడు ఉదయమే రహస్యముగ మదనసేన వద్దకుపోయి, తన స్థితిని తెలియజేసెను. అతని అభిప్రాయము తెలిసికొని మదనసేన సిగ్గుపడి

స్త్రీలతో నిట్టి అనుచితమైన మాటలు చెప్పవచ్చునా ? తండ్రి అనుమతిని నాకు వివాహము కావలెను గాని, నా యిష్టప్రకారము కాదుగదా ! అంతేగాక, నన్ను సువర్ణుడను యువకునకిచ్చి వివాహము చేయుటకు నా తండ్రి వాగ్ధానము చేసిన సంగతి నీకు తెలిసియే ఉండును." అని చెప్పుచుండగా ధర్మదత్తుడు కామోద్రేకముతో యుక్తాయుక్తములు ఆలోచింపక ఆమె హస్తమును పట్టుకొనెను. అప్పుడు మదనసేన అతని స్థితిచూచి జాలిపడి, నాకు వివాహమైన పిమ్మట ముందుగా నీ యిష్టము నెరవేర్చెదను అని ప్రమాణము చేసి చెప్పగా, ధర్మదత్తుడంగీకరించి వెళ్ళిపోయెను.

తరువాత కొన్ని దినములకు రాజు మదనసేనను సువర్ణునకిచ్చి వివాహము జరిపించి, కూతురును, అల్లుని శయ్యాగృహమునకు పంపించెను. అప్పుడు మదనసేన భర్తనిచూచి ధర్మదత్తునకు తానుపూర్వమిచ్చిన వాగ్ధానంసంగతి తెలిపి, అతనివద్దకు పోయివచ్చుటకు ఆజ్ఞయిమ్మని ప్రార్థించగా సువర్ణుడు చాల సంతోషపడి "నీవు యదార్థము చెప్పితివి. కావున వెళ్ళిరమ్మ" అని చెప్పెను.

అంతట మదనసేన ఆ యర్ధరాత్రి సమయమున చీకటిలో ఒంటరిగా బయలుదేరి ధర్మదత్తుని యింటికి పోవుచుండగా, సర్వాపహారియను నొక దొంగ ఆమె నడ్డగించి, ఆమె ధరించిన ఆభరణములనన్నింటిని తీసుకొనుటయేగాక, నీపై నాకు మోహము కలిగినది. కావున ఈ రాత్రి నన్ను సుఖపెట్టి పొమ్మ"అని కోరగా, ఆమె తాను పోవుచున్నపని యొక్క వివరము తెలిపి, తిరిగి వచ్చునప్పుడు నిన్ను కలసిన తర్వాత నాభర్త వద్దకు పోవుదు"నని వాగ్ధానము చేసి, అతని వద్ద శలవు పొంది ధర్మదత్తుని వద్దకువెళ్ళి "నీకు మాటయిచ్చిన ప్రకారం వచ్చితిని కనుక నీ కోరిక తీర్చుకొనుము" అని చెప్పెను.

మదనసేన మాటలు విని ధర్మదత్తుడు ఆశ్చర్యపడి పరదానమంటుట మహాపాపమని భావించి, "నీవు పరదానవు. అందునను ప్రియమిత్రుని భార్యవు. నిన్ను కోరుట కంటె మహాపాపము మరియొకటిలేదు. వెంటనే నీ భర్త వద్దకు పోయి సుఖంగా నుండుము" అని పలికి పంపివేసినాడు.

అంతట మదనసేన యింటికి తిరిగివచ్చుచు చోరుని వద్దకు పోయి "నీ కోరిక తీర్చుకొనుము" అని చెప్పగా, ఆ దొంగ ఎంతో ఆశ్చర్యపడి ఇటువంటి సత్యవంతురాలు భూలోకమున నెచ్చటను లేదని మెచ్చుకొని, అట్టి ఉత్తమ స్త్రీని కోరుట మహాపాపమని భావించి, ఆమె నుండి అపహరించిన ఆభరణములనన్నిటిని యిచ్చివేసి "తల్లీ! నీ మంచి చెడ్డ తెలుగక, నిన్నుకోరి మహాపాపము మూటగట్టుకొంటిని. నా అపరాధం క్షమించి, యింటికిపోయి నీ భర్తతో సుఖంగ ఉండుము" అని పంపివేసెను.

అచ్చటి నుండి మదనసేన తిన్నగా భర్తవద్దకు వచ్చి, జరిగిన వృత్తాంతమంతయు చెప్పగా సువర్ణుడు చాల సంతోషించి ఆమెతో కలిసి సుఖముగా ఉండెను. కావున ఓ విక్రమాదిత్య మహారాజా! సువర్ణుడు, ధర్మదత్తుడు ద్రవ్యాపహారిచోరియనుచోరుడు- ఈ ముగ్గురిలో నెవడు యోగ్యుడు" అని బేతాళుడు ప్రశ్నించగా "భార్య సిగ్గువిడిచి నిష్కళంకముగా భర్తతో చెప్పినందువల్ల సువర్ణుడు పంపుటకు అంగీకరించడం గొప్ప విషయం కాదు. మదనసేన పూర్వము చెప్పినమాట ననుసరించి సత్యము తప్పక ధర్మదత్తుని యొద్దకు పోయినందున ధర్మదత్తుడు బుద్ధిమంతుడు కనుక పరస్త్రీని ముట్టగూడదని తలచి పంపివేయడం కూడ గొప్ప విషయం కాదు. కాని సర్వదా జీవహింస చేయుచు

మృగమువలె సంచరించు మహాపాపియగు దొంగ ఆమెను విడిచిపెట్టుటయే గొప్ప విషయం. కనుక ఆ ముగ్గురిలో దొంగయే యోగ్యుడు" అని విక్రమాదిత్యుడు చెప్పగా, బేతాళుడు విని ఎంతో ఆనందించి మరల చెట్టుమీదికి పోయెను.

భేతాళుడు చెప్పిన - సుకుమారి కథ

అంత విక్రమాదిత్యుడు తిరిగి భేతాళుని పట్టుకొని బంధించి తీసుకొని వచ్చుచుండగా క్రింది కథ చెప్పెను.

జయపురము అను పట్టణమును వైశంపాయనుడు అనురాజు పాలించుచుండెను. అతనికి చంద్రరేఖ, తామరవల్లి, మృగాంక యను ముగ్గురు భార్యలు కలరు. రాజు వారితో అన్యోన్యముగా ఉన్న సమయమున ఒక చిత్రము జరిగెను అది యేమనగా, వసంతఋతువులో ఒకనాడు ఆ రాజు జ్యేష్ఠ భార్యయగు చంద్రరేఖతో కలసి విహరించుచున్న సమయమున ఒక తుమ్మెద వచ్చి ఆ స్త్రీ కొప్పులో ముడిచియున్న పుష్పదళముమీద వ్రాలగా నామె భయపడి మూర్ఛిల్లెను. చెలికత్తె లామెకు ఉపచారములు చేసి మెలుకువ కలిగించిరి.

మరునాడు రాజు రెండవభార్యయగు తామరవల్లితో వనములోనికిపోయి వెన్నెలలో విహరించుచుండగా ఆ వెన్నెల వేడిమికి ఆ స్త్రీ శరీరము పొక్కి బొబ్బలేర్పడెను. మూడవనాడు రాజు తృతీయ భార్యయగు మృగాంకతో కలిసి సౌధాగ్రమున నున్న సమయమున దూరప్రదేశమునందు వడ్లు దంచు శబ్దం వినగానే ఆమెయొక్క చేతులు బొబ్బలెక్కెను. రాజా! ఆ ముగ్గురు స్త్రీలలో సుకుమారి ఎవరు?" అని బేతాళుడు అడుగగా, "వడ్లు దంచిన శబ్దము వలన

హస్తములు పొక్కుటవలన పై ముగ్గురిలో మృగాంక మిక్కిలి సుకుమారి"యని విక్రమాదిత్యుడు చెప్పగా, బేతాళుడు ఆనందించి మరల చెట్టుమీదికి పోయి నిలచెను.

భేతాళుడు చెప్పిన - ఎవరికీ పాపమంటుని కథ

అంతట విక్రమాదిత్యుడు మరల చెట్టుపైకి పోయి బేతాళుని బంధించి తీసుకొని వచ్చుచుండగా ఒక కథ నిట్లు చెప్పెను—

గంగాతీరములో వారణావతియను పట్టణము కలదు. అందు సకల విద్యా ప్రవీణుడైన బ్రాహ్మణుడు ఉండెను. అతనికి అర్జునస్వామి అను పుత్రుడు పుట్టెను. ఆ పుత్రుని కతడు పదునారేండ్లు నిండిన తరువాత ఉత్సాహవతి యను కన్యను వివాహం చేసెను.

ఒకనాడు అర్జునస్వామి భార్యతో కలసి వెన్నెలలో క్రీడించుచుండగా ఒక రాక్షసుడు వచ్చి అతని భార్యను ఎత్తుకొనిపోయెను. అప్పుడు అర్జున స్వామి తీవ్రమైన విచారమున మునిగి, తల్లిదండ్రులు మొదలగువారు ఎంత చెప్పినను వినక, భార్యజాడ తెలుసుకొనవలెనని ఇల్లు వదలి, సకలదేశములు తిరిగి తుదకు వంగదేశమునకు పోయి పద్మనాభుడు అను బ్రాహ్మణుని దర్శించి భోజనము కావలెనని యడుగగా, నా బ్రాహ్మణుడు అంగీకరించి తన భార్యను పిలిచి ఆ బ్రాహ్మణునకు అన్నం పెట్టుమని చెప్పి ఏదో పనిపై బయటకు పోయెను.

అప్పుడు ఆ బ్రాహ్మణుని భార్య త్వరితంగా వంటచేసి అర్జున స్వామిని భోజనమునకు రమ్మని పిలువగా నతడు "అమ్మా! నేను ఇంకను సంధ్యా వందనం చేయలేదు. అన్నం యిచ్చిన ఏ చెఱువువద్దకైన పోయి, సంధ్యా వందనం చేసిన పిమ్మట భుజించెద"నని చెప్పెను.

అతని మాటలు విని, ఆ బ్రాహ్మణి మోదుగ ఆకు విస్తరలో అన్నం, కూరలు, నెయ్యి మున్నగునవి పెట్టి యివ్వగా అతడు దానిని తీసుకొని ఒక మడుగువద్దకుపోయి గట్టుపైనున్న చెట్టుక్రింద అన్నపుమూట నుంచి, మడుగులో స్నానంచేసి సంధ్యావందనాది క్రియలు జరుపుకొని, ఒడ్డుకువచ్చి మూటవిప్పి మరల చెరువులో దిగి మంచినీరు తెచ్చుకొనుటకు పోయెను.

ఆ సమయమున గరుత్మంతు డొక సర్పమును పట్టుకొనివచ్చి చెట్టు కొమ్మపై నుంచుకొని తినుచుండగా సర్పవిషం క్రిందనున్న అన్నంలో పడినది. అప్పుడు అర్జునస్వామి జలం దీసుకొని వచ్చి కూర్చుండి అన్నం తినగానే మర ణించెను. కనుక ఆ పాపం అన్నం యిచ్చిన బ్రాహ్మణ వనితకు చెందునా? లేక అన్నం పెట్టమన్న బ్రాహ్మణునకు చెందునా? లేక గరుత్మంతునికి చెందునా? లేక సర్పమునకు చెందునా?" అని బేతాళుడు ప్రశ్నించగా, అన్నం కావలసిన వాడు అన్నమడుగుట ధర్మం. భర్త ఆజ్ఞ ప్రకారం చేయుట భార్యకు ధర్మం. గరుడుడు పామును పట్టుట న్యాయం. ప్రాణావస్థలోనున్న పాము విషం క్రక్కుట సహజం. వీరిలో నెవరికయిన పాపం కలదని చెప్పెడివారికి పాపం కలుగును" అని విక్రమాదిత్యుడు చెప్పగా, బేతాళుడు విని మరల పారిపోయి చెట్టుపై నిలచెను.



భేతాళుడు చెప్పిన - తీర్థవర్మియను మంత్రి కథ

విక్రమాదిత్యుడు తిరిగి చెట్టుమీదికి పోయి బేతాళుని పట్టి బంధించు చుండగా, బేతాళుడు ఈ కథను చెప్పెను.

పూర్వం విజయపురమను పట్టణమును వంశకేతుడను రాజు పాలించు చుండెను. అతని భార్య సత్యవ్రత సాటిలేని సౌందర్యవతి. రాజు భార్యనువిడిచి ఒక క్షణమైనను గడుపలేక, ఎల్లవేళల అంతఃపురముననే గడుపుచు రాజ్య

పాలనలో చాల అశ్రద్ధ వహించెను. ఆ రాజువద్ద తీర్థదర్శియను మంత్రి యుండెను. అతడు మంచి రాజభక్తి కలవాడగుటచే రాజుకు బదులు తానే రాజ్య వ్యవహారములను శ్రద్ధగా చూచుచు ప్రజలను రక్షించుచుండెను.

ప్రజలు అసలు విషయం ఎరుగక రాజు అసమర్థుడగుటచే మంత్రి రాజ్యం చేజిక్కించుకొని తమను పాలించుచున్నాడని మంత్రిపై లేనిపోని నిందలు వేయసాగిరి. మంత్రి తనపై కలిగిన అపవాదములకు బాధపడి రాజ్యమును వదలి పరదేశములకు పోయెను. అప్పుడు రాజు మరియొక మంత్రికి రాజ్య పాలన అప్పగించి ముందువలె భార్యతో అంతఃపురముననే గడుపసాగెను.

రాజ్యమును వదలివెళ్ళిన తీర్థదర్శి సకలదేశాలలో సంచరించి తుదకు సముద్రతీరానగల ఒక పట్టణం చేరి అచ్చట నొక వర్తకునితో స్నేహం చేసెను. వారు ఒకరినివిడిచి మరియొకరు ఒక క్షణమైన ఉండలేకుండిరి.

ఇట్లుండగా ఆ వర్తకుడు వ్యాపారార్థం విదేశమునకు ఓడనెక్కి పోవుటకు నిశ్చయించుకొని, ఆ సంగతి తీర్థదర్శికి చెప్పగా, నిన్ను విడిచి నే నిచ్చట ఒంటరిగా గడుపలేను. నన్ను కూడ నీ వెంట దీసుకొని పొమ్మని కోరగా, ఆ వర్తకుడు అంగీకరించి తీర్థదర్శినికూడ ఓడలో దీసుకొనిపోవుచుండగా సముద్ర మధ్యమందొక కాళికాలయమును, ఒక కొలనును, ఆ కొలనువద్ద నొక కన్యను చూచి, ఆశ్చర్యపడి "ఇంత అందమైన స్త్రీని ఎచ్చటను చూడలేదు. ఈమె ఎవ" రని వర్తకుని అడుగగా, "ఇచ్చటికి వచ్చినప్పుడు ఈ స్త్రీని చూచుచుందును. ఆమె ఎవరో నాకు తెలియదు" అని చెప్పెను.

పిమ్మట ఆ వర్తకుడు విదేశముచేరి తన సరకులను విక్రయించి విశేష ధనమార్జించి తిరిగి స్వస్థలమునకుచేరిరి. తరువాత తీర్థదర్శి వర్తకుని యొద్ద శలవుపుచ్చుకొని తన రాజ్యమునకుపోయి రాజును దర్శించెను. రాజు తన మంత్రి తిరిగి వచ్చినందుకు ఆనందించి ఆలింగనము చేసికొని ఎంతో గౌరవించి "ఇంత కాలము విదేశములలో గడుపుటకు కారణమేమి" అని అడుగగా, తీర్థదర్శి "మీరు రాజ్యపాలన విషయములలో తగినంత శ్రద్ధ తీసుకొనకపోవుట వలనను తనకు అపనిందలు కలుగుటవలనను దేశమువిడిచి పోయితిని" అని చెప్పెను. తరువాత అతడు తానుచూచిన దేశములలోని విశేషములను రాజుకు చెప్పునప్పుడు సముద్ర మధ్యముననున్న కాళికాలయమును గూర్చి, అచ్చట కనబడిన సుందరిని గూర్చి తెలిపెను. అట్టి అందమైన స్త్రీని నేను ప్రపంచములో ఎచ్చటను చూడలేదని చెప్పగా రాజు ఆనందించి, స్త్రీలోలుడగుటచే ఆకన్యను చూచివచ్చెదను. అంత వరకు రాజ్యమును నీవు చూచుచుండవలసినదని ఆజ్ఞాపించి వర్తకుని వివరములు తెలిసికొని అతనివద్దకు పోయి స్నేహముచేసెను. తరువాత ఆ వర్తకునితో కలిసి ఓడలో విదేశమునకు పోవుచుండగా మార్గమధ్యమందున్న కాళికాలయము అచ్చటనున్న సుందరినిచూచి ముగ్ధుడై ఆలయములోనికి పోయి దేవికి ప్రదక్షిణ నమస్కారాదులు చేసి, "తల్లీ! నాకు ఈకన్యను దయచేయుము" అని ప్రార్థించి ఆ కన్యవద్దకు పోయి మాట్లాడబోగా ఆమె యతనినిచూచి నీటిలో దుమికెను. వెంటనే రాజు కూడ నీళ్ళలోదుమికి ఆమెవెంటపోయి "సుందరీ! నిన్నుకోరి వచ్చితిని. నన్ను నీభర్తగా అంగీకరించు"మని కోరెను.

అతడు మహారాజని ఆకన్య తెలుసుకొని "నేడు అష్టదినము కనుక మంచిదినం చూచి రమ్మ"నెను. తరువాత రాజు ఒక మంచిదినమునాడు ఆమె వద్దకుపోయి, సరససల్లాపములాడి సుఖముగా గడిపెను. ఇట్లు కొన్నిదినములు గడపిన తరువాత రాజు ఆమె మనస్సు కనిపెట్టవలెనని ఒక చెట్టుచాటున నక్కి యుండగా, కన్య స్నానంచేయుటకు సరస్సుకు పోయెను. అప్పుడొక రాక్షసుడు వచ్చి ఆకన్యను మ్రింగెను. అదిచూచి రాజు వేగముగాపోయి తన ఖడ్గముతో నా రాక్షసుని ఖండించి వాని గర్భమందున్న కన్యను పైకితీసి రక్షించెను. అప్పుడు ఆకన్య రాజునుచూచి "ఓ మహారాజా! ఒక రహస్యమునుచెప్పుచున్నాను వినుము. నేను దేవలోకమునందు విద్యాధరవంశంలో మృగాంకదత్తుడనువాని కుమార్తెను. నాకు జ్యేష్ఠభ్రాతలు వేయిమంది గలరు. నేను నాతండ్రికి ఏకైక పుత్రికను. కనుక మిక్కిలిప్రేమతో పెంచుచుండెను. ఒకనాడు నావ్రతంపట్టి నా తండ్రికి కనబడ సందున తీవ్రవిచారమునకు లోనై ఉపవాసముండెను. తరువాత నేను ఇంటికి పోగానే నన్నుచూచి ఆకలి కోపంతో "నిన్ను రాక్షసుడు మ్రింగుగాక" అని శపించెను. అప్పుడు నేను తండ్రికి మ్రొక్కి "తండ్రీ! నాకీ శాపవిమోచనమెప్పటికగు"నని అడుగగా, జాలిపడి "భూలోకమున వంశదత్తుడను రాజు నీతో స్నేహముగ నుండి రాక్షసుడు నిన్ను మ్రింగుసమయమున వానిని చంపి, నిన్ను బ్రతికించు"నని చెప్పెను. అనగా ఆమె మాటలువిని రాజు ఎంతో సంతోషించెను. తరువాత వారిద్దరు అచ్చటినుండి విజయపురంనకు వచ్చిరి.

తిరిగివచ్చిన రాజును చూచి మంత్రులు, ప్రజలు మొదలగువారు ఎంతో ఆనందించి పండుగ చేసికొనిరి. రాజు ఆ సుందరాంగితో అంతఃపురమునకు పోయి సుఖంగా కాలం గడుపసాగెను. ముందువలెనే అతడు రాజ్యకార్యములను నిర్వహించక, పాలనాభారమంతయు మంత్రులపై వదలి సంతోషంగా ఉండెను. తీర్థదర్శియను మంత్రి రాజుయొక్క ప్రవర్తనలో మంచిమార్పు రానందుకు చింతించి విషముతిని మరణించెను. ఓ విక్రమాదిత్య మహారాజా! ఆమంత్రి రాజు రాజ్యమునకు తిరిగివచ్చెనని మరణించినాడా, లేక తాను చూచివచ్చిన కన్యను తెచ్చుకొని అంతఃపురమున సుఖించుచున్నాడను విచారముచేత మృతినొందినాడా?" అని భేతాళుడు అడుగగా "రాజుయొక్క గుణం తెలిసిఉండియు తీర్థదర్శి ఆ కన్యయొక్క అందచందాలను వర్ణించి చెప్పెను. పిల్లలకు తీపివస్తువులు పెట్టినట్లును, దుర్జనులకు హితవు చెప్పినట్లును, సహజకామియైనవానికి మరియొకసుందరి నంటగట్టితిని గదా యని పశ్చాత్తాపపడి విషంతిని చచ్చెను" అని విక్రమాదిత్యుడు చెప్పగా భేతాళుడు సంతోషించి మరల పైకిఎగిరి చెట్టుపై నిలచెను.

భేతాళుడు చెప్పిన - మణిమేఖల కథ

పట్టువిడువని విక్రమాదిత్యుడు మరల చెట్టుపైకిపోయి భేతాళునిబంధించి మోసుకొని వచ్చుచుండగా ఈ క్రింది కథ చెప్పెను—

పూర్వము మహాబలుడు అనురాజు ఉండెను. అతనికి మణిమేఖలయను కూతురు కలదు. రాజు ఆమెను సకలవిద్యలలో నారితేరిన యువకునకు యిచ్చి వివాహం చేయవలెనని నిశ్చయించుకొని యుండగా మణిమేఖలుడను యువకుడు సకల విద్యలలో ఆరితేరినవాడని తెలిసికొని యొక శుభముహూర్తమున అతనికి యిచ్చి వివాహం గావించెను. వారు అత్యంతప్రేమానురాగములు కలిగి సుఖంగా కాలం గడుపుచుండిరి.



ఒకనాడు ఆ దంపతులు మంచంపై శయనించియున్న సమయమున ఆ మంచంక్రింద రెండు చీమల గుంపులు సంచరించుచుండెను. ముందుపోవుచున్న చీమలు ఉన్నట్టుండి నిలబడిపోయినవి. వెనుక వచ్చుచున్న చీమలు ఎందుకు నిలిచి పోయినారని యడిగినవి. మంచమడ్డు వచ్చుటచే నిలిచితిమని ముందు చీమలుచెప్పినవి. వెనుక వచ్చుచున్న చీమలు అట్లయినచో మంచము నెగురగొట్టి పోవుదము అని చెప్పినవి. అప్పుడు ముందున్న చీమలు భార్యాభర్తలు సుఖముగ నిద్రించుచుండగా అట్లుపోవుట పాపమని జంకి ఆగితిమి అని చెప్పినవి.

రాజుకు చీమల భాష తెలిసినందున వాటిమాటలు విని ఆశ్చర్యపడి ఫక్కుమని నవ్వెను. భర్త అట్లునవ్వుటకు కారణమేమో తెలియక మణిమేఖల "నాథా! మీరు ఎందుకు నవ్వినారు?" అని యడిగెను. దంపతులిద్దరు మాట్లాడు కొనుట విని చీమలు బిగ్గరగా "ఓ రాజా! మేము మాట్లాడుకొన్న మాటలు ఎవరితోనైన చెప్పినయెడల తలపగిలి చత్తు"వని చీమలభాషలో చెప్పినవి.

ఆ మాటలు విని రాజు తీవ్రమైన విచారంలో మునిగి పోయెను. మణిమేఖల "నా ప్రశ్నకు బదులు చెప్పక మౌనము వహించితిరేమి? నాపై మీకు ప్రేమ లేదు కాబోలు! ఇట్టి దాంపత్యమెవరికి సుఖమగును? మీరు ఎందుకు నవ్వినారో నిజం చెప్పకున్న విషము త్రాగి ప్రాణము విడిచెద"నని కోపంగా చెప్పెను.

రాజు తన భార్యకు సంతోషం కలిగించవలెనను తలంపుతో, చితి నేర్పరచుకొని, దానిపై పరుండి, భార్యను చేరబిలిచి చీమలు చెప్పుకొన్న మాటలు తెలుపబోయెను.

అప్పుడు అతనికి ఒక ఆడమేక, ఒక మగ మేక కనబడెను. పోతు పెంటితో కలువబోయెను. పెంటి అందుకు ఇష్టపడక నీకు నాపై ప్రేమ యున్నచో ఆ బావియందు వ్రేలాడుచున్న మెత్తని పచ్చికను తెచ్చియిమ్ము. పిమ్మట నిన్ను కలియుదును అని చెప్పెను. పోతు ఆ పెంటి మాటలు విని మిగుల వ్యధపొంది "ఓసీ, నీ ఆడుబుద్ధి చూపించితివి. నీకై నేనా పచ్చిక తెచ్చుటకు పోయి వంగినచో కాళ్ళుజారి నూతిలోపడి ప్రాణములు పోగొట్టుకొను తథ్యం. పిమ్మట నెవరితో చేరుదును? నీవు యెవరితో చేరుదువు? ప్రమాదము కలిగించు నీ స్నేహం ఉన్నను లేకున్నను ఒక్కటే! తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం కనుక నీ దారిని నీవు పొమ్ము" అని కఠినంగా పలికెను.

చితిపై నున్న రాజు మృగ భాష తెలిసియున్న వాడగుటచే ఆ మేకల సంభాషణ విని, చితి నుండి గభాలున పైకి లేచి, పట్టణమునకు పోయి మరియొక కన్యను వివాహమాడి సుఖంగా ఉండెను. వింటివి గదా రాజా! ఇందెవరి బుద్ధి యెక్కువ"యని భేతాళుడు అడిగెను. అది విని విక్రమాదిత్యుడు "నోరు లేని జీవియైనను ఆ పోతుమేక ఆడుదాని మాటలకు లొంగిపోలేదు కావున వా పోతు యొక్క బుద్ధియే యెక్కువ" అని చెప్పగా, బేతాళుడు అంగీకరించి మరల చెట్టు మీదికి పారిపోయెను.

భేతాళుడు చెప్పిన - మంత్రము నేర్చుటకు అర్హుడుకాని బ్రాహ్మణుని కథ

విక్రమాదిత్యుడు మరల భేతాళుని బంధించి తీసుకొని పోవుచుండగా అతడు మరియొక కథనిట్లు చెప్పసాగెను.

పూర్వం ధర్మపురి అను పట్టణము నందొక పాడుబడిన దేవాలయం ఉండెను. దానియందొక బ్రాహ్మణుడు ఆకలి బాధకు ఆగలేక పండుకొని యుండెను. అతనిని ఒక యోగిచూచి, జాలిపడి, అతని ఆకలిబాధ తొలగించవలెనని తలచి, తన మంత్రమహిమచే ఒక పట్టణమును సృష్టించి ఆ పట్టణములో నొక గృహమును భక్ష్యభోజ్యాదులతో నిండియుండునట్లు చేసెను. తరువాత ఆ బ్రాహ్మణుని ఆ గృహమునకు పిలుచుకొని పోయి అతని యాకలిబాధ తీర్చెను. బ్రాహ్మణుడు మిక్కుటంగ భుజించి ఆయాసం తీర్చుకొనుచుండెను.

ఆ బ్రాహ్మణునకు మంత్రోపదేశం చేయవలెనని ఆ యోగి భావించి, అతనిని స్నానంచేసి రమ్మని చెప్పెను. యోగి చెప్పినట్లు ఆ బ్రాహ్మణుడు సమీపముననున్న కొలనుకు పోయి యందు మునిగెను. అతడట్లు మునుగుసరికి అతనికొక కలవచ్చెను. తన కుమారుడు వచ్చి యెదుట నిలబడినట్లు కలగనెను. కండ్లు విప్పిచూడగా ఎవరుగు కనబడలేదు. ఆ విషయం నతడు యోగికి తెలిపెను.

అది విని ఆ యోగీంద్రుడు నేను నీ విషయంన వ్యర్థంగ- ప్రయాస పడితిని. నే నిపుడు ఉపదేశింపబోవు మంత్రం నీకు ఫలింపదు కనుక నీదారిననీవుపొమ్ము." అనిచెప్పి పంపివేసెను. ఆ బ్రాహ్మణుడు విచారించుచు వచ్చిన దారిని పోయెను. ఓ వి క్ర మా ది త్య మహారాజా! యోగికి ఫలించిన మంత్రం ఆ బ్రాహ్మణునకు ఫలింపకుండుటకు కారణమేమి" అని ప్రశ్నింపగా "వ్రతం, శ్రద్ధ, దానం, మంత్రం, జపము మొదలగువానికి ఏకాగ్ర చిత్త మావశ్యకము. ఆ బ్రాహ్మణుడు ఏకాగ్రమనస్కుడుకానందున యోగి అతనికి మంత్రం ఉపదేశించుటకు ఇష్టపడలేదు" అని విక్రమాదిత్యుడు చెప్పెను. అదివిని బేతాళుడు మరల చెట్టుమీదికి పోయెను.

భేతాళుడు చెప్పిన-వైశ్యపుత్రుని కథ

విక్రమాదిత్యుడు మరల భేతాళుని బంధించి తీసికొని పోవుచుండగా, అతడు ఒక కథ నిట్లుచెప్పెను.

రామనగరమను పట్టణమున ఒక వర్తకుడు ఉండెను. అతనికొక కుమార్తెగలదు. ఆమె అవివాహితురాలుగా ఉన్నప్పుడు ఒక బ్రాహ్మణుని ప్రేమించి అతనితో రహస్యంగా సుఖించుచుండెను.

ఇట్లు జరుగుచుండగా ప్రక్క యూరినుండి ఒక వైశ్య యువకుడు ఆ వర్తకుని వద్దకువచ్చి అతని కుమార్తెను తనకుయిచ్చి వివాహము చేయమనికోరెను

ఆ వర్తకుడు అతడు తన కుమార్తెకు తగిన వరుడని నిశ్చయించుకొని ఒక శుభ ముహూర్తమున కూతురునిచ్చి పెండ్లి చేసెను. తరువాత అల్లునితో కుమార్తెను అత్తవారింటికి పంపెను.

ఆ వైశ్యయువతి తన ప్రియుడగు బ్రాహ్మణుని వదలివుండలేక మనో వ్యాధితో మంచమెక్కి తుదకు మరణించెను. తన ప్రియురాలు మరణించినదను సంగతి తెలిసి ఆ బ్రాహ్మణుడు దుఃఖము భరించలేక ఆత్మహత్య చేసికొనెను. భార్యపై మిక్కిల అనురాగముగల వైశ్యయువకుడు ఆమెలేని జీవితమెందుకని, ఆమె వియోగము భరించలేక ప్రాణమువిడిచెను. రాజా! ఆ ముగ్గురిలో నెవరధి కులో చెప్పుమని భేతాళుడు అడుగగా "వర్తకుని కూతురును. బ్రాహ్మణుడను మరణించినది గొప్పవిషయంకాదు. వారుభయులు ప్రేమించుకొని కొంతకాలము సుఖించిరి. ఏమియుఎరుగని వైశ్యపుత్రుడు ఆమె మరణించినందుకు బాధపడి ప్రాణము విడుచుట గొప్పవిషయము కావున అతడే శ్రేష్ఠుడు" అని విక్రమాది త్యుడు చెప్పగా భేతాళుడు సంతోషించి ఎగిరి చెట్టుమీదికి పోయెను.

భేతాళుడు చెప్పిన - పులిని బ్రతికించిన బ్రాహ్మణ యువకుల కథ

విక్రమాదిత్యుడు మరల చెట్టుపైకి పోయి భేతాళునిపట్టి బంధించి తీసు కొని వచ్చుచుండగా ఈ కథ చెప్పెను.

ధర్మవరమను గ్రామములో విష్ణుశర్మ యనునొక బ్రాహ్మణుడు ఉండెను. అతనికి నలుగురు పుత్రులుపుట్టిరి. వారు యుక్తవయస్కులై నంతట దేశాటనమునకు పోయిరి.

అట్లువెళ్ళిన ఆ బ్రాహ్మణయువకులు ఒక యోగీశ్వరుని దర్శించి భక్తిశ్రద్ధలతో సేవలుచేసిరి. వారి సేవలకు మెచ్చి ఆ యోగీంద్రుడు మృతసంజీవిని మొదలగు మంత్రములు నుపదేశించెను.

బ్రాహ్మణ యువకులను చంపి తినుచున్న పులి